PRAJASAKTI Regd.No. APTEL/2004/12202

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Kurnool, Vijayawada, Visakhapatnam, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 19 సంచిక : 144 | కర్నూలు, ఆదివారం 25 డిసెంబర్ 2022 | 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Kurnool, Sunday 25 December 2022 | Rs

26న దేశవ్యాప్తంగా జిల్లాల్లో
ట్రాక్టర్ మార్చ్‌లు
- హర్యానా జిందలో భారీ కిసాన్ మహాపంచాయత్
- ఎస్‌కెఎం జాతీయ సమావేశంలో నిర్ణయం
- విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్

లోపలి పేజీలో..





పులివెందుల సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

చెడిపోయిన వ్యవస్థతో యుద్ధం చేస్తున్నాం

- త్వరలో ఆరులైన్ల బెంగళూరు-పులివెందుల-విజయవాడ రహదారి
- 175 సీట్లు గెలుపే లక్ష్యం : ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి- కడప ప్రతినిధి, వేంపల్లె

రాష్ట్రంలో చెడిపోయిన వ్యవస్థతో యుద్ధం చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. కేవలం ప్రతిపక్షనేత చంద్రబాబుతోనే యుద్ధం చేయడంలేదని, చెడిపోయిన వ్యవస్థతో యుద్ధం చేయాల్సి వస్తోందని తెలిపారు. కడప జిల్లా పులివెందుల పట్టణంలో మూడేళ్ల కిందట శంకుస్థాపన చేసిన పలు అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో జగన్ మాట్లాడుతూ పులివెందుల్లో ఆర్‌టిసి బస్టాండు నిర్మాణంపై చంద్రబాబు చేసిన విమర్శకు సమాధానంగా, దేశంలోని ఆర్‌టిసి బస్ టెర్మినల్స్ అన్నింట్లోకి అధునాతన హంగులతో రోల్‌మోడల్‌గా నిర్మించి ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలో టిడిపి, చంద్రబాబుతో యుద్ధం చేయడం లేదని, నెగిటివ్ మీడియాతో, చెడిపోయిన వ్యవస్థతో యుద్ధం చేయాల్సి వస్తోందని అన్నారు. బటన్ నొక్కడం ద్వారా మూడు లక్షల కోట్ల రూపాయల మేర లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. గతంలో ఇదే బడ్జెట్, ఇదే రాష్ట్రం ఉండేదని, అప్పటి పాలకులు ఈ పని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.

గతానికీ, నేటికీ తేడా ముఖ్యమంత్రి మారడమే కారణమని, దీన్ని గమనించాలని అన్నారు. రాష్ట్రంలో వివక్ష, లంచాలకు ఎక్కడా తావు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రతిపక్షాల వారికి కూడా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. రూ.13 వేల కోట్లతో బెంగళూరు - పులివెందుల - విజయవాడ ఆరు లైన్ల జాతీయ రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. 14 ప్యాకేజీలకుగానూ పది ప్యాకేజీలకు టెండర్లు పిలిచామన్నారు. రూ.1087 కోట్లతో పులివెందుల-బెంగళూరు, రూ.1041 కోట్లతో పులివెందుల-బి.కొత్తకోట నాలుగు లైన్ల రహదారి పనులు చేపట్టనున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల గెలుపే లక్ష్యంగా ముందుకెళుతున్నామని, గత సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన 151 సీట్లను అధిగమించడం ఎందుకు సాధ్యం కాదని కార్యకర్తలకు దిశానిర్దేశం

మిగతా 2లో

బంగాళాఖాతంలో అల్పపీడనం

- చలిగాలులు, వర్ష సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నైరుతీ బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు యానాంలో చలిగాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈశాన్య, తూర్పు దిశల్లో ఈ చలిగాలులు వీస్తాయని పేర్కొంది. మరో ఒకటి, రెండు రోజులు ఈ పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నెల 25న రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో ఒక మోస్తారు వర్షాలు పడే అవకాశాలున్నాయని తెలిపింది. వాతావరణ శాఖ తెలిపిన సమాచారం మేరకు శనివారం సాయంత్రానికి ట్రింకోమలీ(శ్రీలంక)కి తూర్పు ఈశాన్యంగా 400 కిలోమీటర్ల దూరంలో, నాగపట్నంకు తూర్పుగా 470 కిలోమీటర్లు, చెన్నైకి తూర్పు ఆగ్నేయంగా 500 కిలోమీటర్లు సమీపంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉంది. ఇది గంటకు 13 కి.మీ వేగంతో పశ్చిమ నైరుతి దిశగా పయనించే అవకాశం ఉంది. ఆదివారం ఉదయానికి శ్రీలంక తీరానికి చేరకుని, అక్కడినుండి పశ్చిమ నైరుతీ దిశగా కదులుతూ 26 ఉదయం నాటికి కొమోరిన్ పరిసర ప్రాంతాలకు చేరుకుంటుంది.

బట్టబయలైన కాషాయ బూటకం!

- ఎల్గార్ పరిషద్‌కు, హింసకు సంబంధమే లేదు
- విచారణా కమిషన్ ముందు సాక్ష్యమిచ్చిన పోలీసు అధికారి

లోపలి పేజీలో..

రసీదుల్లేని ఇ-క్రాప్

- ఖరీఫ్‌లో నూరు శాతం నమోదులన్న సర్కారు
- పది శాతం కూడా లేని అక్నాలడ్జ్‌మెంట్
- పారదర్శకత ప్రశ్నార్థకం
- రైతులకు నష్టం
- అక్రమార్కులకు అవకాశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి



పంట సాగుల నమోదుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇ-క్రాప్' పారదర్శకత ప్రశ్నార్థకంగా తయారైంది. ఇ-క్రాప్ పోర్టల్‌లో పంటలు నమోదయ్యాయని తెలియజేస్తూ రైతులకు విధిగా వ్యవసాయశాఖ భౌతిక రసీదులు జారీ చేయాల్సి ఉండగా, ఆ ప్రక్రియ ఆనవాళ్లు ఎక్కడా కనిపించట్లేదు. ఖరీఫ్ ముగిసి రబీ సీజన్ సగం గడుస్తున్నా ఖరీఫ్ పంట నమోదుల భౌతిక రసీదులు పట్టుమని పది శాతం కూడా పూర్తి కాలేదని సమాచారం. ఈ ఏడాది ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యానవన, సెరీకల్చర్ అన్నీ కలుపుకొని కోటి పది లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయని సర్కారు వెల్లడించింది. నూరు శాతం విస్తీర్ణానికి ఇ-క్రాప్ చేసేశామనీ ప్రకటించింది. రైతులకు జారీ చేసే రసీదులను మాత్రం విస్మరించింది. దాంతో తమ పేరు ఆన్‌లైన్ రికార్డుల్లో ఎక్కిందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల వద్ద ఇ-క్రాప్ చేయించుకున్న ఆధారం లేక అన్ని విధాలా నష్టపోయే ప్రమాదం నెలకొంది.

జవాబుదారీ ఏదీ?

ప్రభుత్వం రైతన్నల కోసం అమలు చేసే అన్ని పథకాలకూ ఇ-క్రాప్ తప్పనిసరి చేసింది. ఇ-క్రాప్‌లో ఎక్కితేనే రైతు భరోసా, సున్నావడ్డీ, విత్తన సబ్సిడీ, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పంట రుణాలు... చివరికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు పంటలు అమ్ముకోవాలన్నా ఇ-క్రాపే. అంత ముఖ్యమైన ఇ-క్రాప్ విధానంలో పారదర్శకత, జవాబుదారీతనం లోపించింది. గ్రామ స్థాయిలోని రైతు భరోసా కేంద్రం (ఆర్‌బికె)లో విలేజి అగ్రికల్చర్ అసిస్టెంట్ (విఎఎ) రైతుల పొలాల వద్దకెళ్లి ఏ సర్వే నెంబర్‌లో ఎంత విస్తీర్ణంలో ఏ పంట సాగు చేశారో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. వెబ్‌ల్యాండ్‌లో ఎక్కిన సర్వే నెంబర్లలోనే సాగులు నమోదవుతాయి. కౌలు రైతులకైతే సిసిఆర్‌సి గుర్తింపు ఉంటేనే ఇ-క్రాప్‌లో ఎక్కుతాయి. ఆ జాబితాలను ఆర్‌బికెలలో ప్రదర్శించమన్నారు. సోషల్ ఆడిట్ అన్నారు. ఉన్నతాధికారుల ర్యాండమ్ తనిఖీలన్నారు. అనంతరం తుది జాబితాలను ధ్రువీకరించి రైతులకు రసీదులివ్వాలి. రసీదులు మినహా అన్ని పనులూ ఏదోఒక విధంగా అయిందనిపించింది ప్రభుత్వం, రసీదులు మాత్రం ఇవ్వట్లేదు. డిసెంబర్ 9 లోపు ఇ-క్రాప్ పూర్తి కావాలనగా రసీదుల పంపిణీ పది శాతం కూడా జరగలేదు. ఎంఎఒ నిర్ణీత ఫార్మెట్‌లో ధ్రువీకరించి ఎ.డి.కి, అక్కడి నుంచి డిఎఒకు, అక్కడి నుంచి కమిషనర్‌కు రసీదుల సమాచారం పంపాలనగా సరైన పర్యవేక్షణ లేక కార్యక్రమం అటకెక్కింది.

అవినీతికి దారులు

పలు ప్రభుత్వ పథకాలకు అర్హులైనప్పటికీ ఇ-క్రాప్ లేదనే పేర రైతులను తిరస్కరిస్తున్నారు. తాము ఇ-క్రాప్ చేయించుకున్నామని రైతులు మొత్తుకుంటున్నా వినిపించుకునే నాథుడే లేడు. సర్కారు నుంచి వచ్చే పంట నష్టపరిహారం, బీమా, సున్నా వడ్డీ, యంత్ర పరికరాలు తదితరాలను రైతులు నష్టపోతున్నారు. కనీసం పంటలు అమ్ముకునే పరిస్థితి కూడా లేదు. సిబ్బంది చాలా ప్రాంతాల్లో పై నుంచి వచ్చే ఒత్తిళ్లతో రైతులను సంప్రదించకుండానే పంటలను నమోదు చేస్తున్నారు. రికార్డులో ఉన్న పంటకు, వేసిన పంటకు తేడా వచ్చినప్పుడు పరిహారాలు రావట్లేదు. అధికారులు, సిబ్బంది చేసే తప్పులకు రైతులు బలవుతున్నారు. కొన్ని చోట్ల నెట్, సర్వర్ ఇత్యాది సాంకేతిక కారణాల వలన డేటా కరప్ట్ అయి ఎగిరిపోతోంది. అటువంటి సందర్భాల్లో రైతులు ఇ-క్రాప్‌లో ఎక్కినట్లు ఆధారం ఉండట్లేదు. ఒక్కొక్క ఆర్‌బికెలో 600 వరకు రైతులుంటారు. వారికి రసీదులివ్వడం పెద్దగా ఇబ్బంది ఉండదు. రసీదులివ్వకపోవడం వలన సాగుదారులు కాని వారు, తప్పుడు సమాచారంతో అనర్హులు, పెత్తందారులు అక్రమాలకు పాల్పడే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, రసీదులివ్వకుండా ప్రభుత్వమే అక్రమాలను ప్రోత్సహిస్తోందన్న విమర్శలూ వినిపిస్తున్నాయి.

అమ్మభాషను పరిరక్షించుకుందాం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎవి శేషసాయి
- ఘనంగా ముగిసిన తెలుగు రచయితల మహాసభలు
- ఆకట్టుకున్న జొన్నవిత్తుల తెలుగు పద్యాల ప్రసంగం

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్



ముగింపు సభలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి

అమ్మభాషగా ఉన్న తెలుగు భాషను పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఇందులో కవులు, రచయితలు ముఖ్య భూమిక పోషించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి అన్నారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం, ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానా ప్రపంచ సాహిత్య వేదిక, ప్రపంచ తెలుగు రచయితల సంఘం సంయుక్తంగా విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు శనివారం ముగిశాయి. ప్రాభవం కోల్పోతున్న తెలుగును పరిరక్షించుకోవాలని, తెలుగు భాషను పరిరక్షించే బాధ్యత కవులపైనే ఎక్కువగా ఉందని మహాసభల్లో ప్రతి ఒక్కరి నోటా వినిపించింది. రెండో రోజు శనివారం సాయంత్రం జరిగిన ముగింపు సభలో జస్టిస్ ఎ.వి.శేషసాయి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఎందరో మహనీయులు, కవులకు పుట్టినిల్లు తెలుగు రాష్ట్రమన్నారు. తెలుగు కవులు ప్రజలను ఎంతో చైతన్యం చేస్తున్నారని పేర్కొన్నారు. వారు ఉన్నంత వరకూ అమ్మభాషకు భయం లేదన్నారు. అమ్మభాషను పరిరక్షించడంలో అమ్మే ప్రధాన పాత్ర వహించాలని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథి, సినీకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు చక్కని తెలుగు పద్యాలతో సభను ఆద్యంతం రక్తి కట్టించారు. ప్రస్తుతం తెలుగు భాషా బోధించే పాఠశాలలు కనిపించడం లేదని అన్నారు. రానున్న కాలంలో తెలుగును పరిరక్షించుకునే బాధ్యత రచయితలపైనే ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ప్రముఖ కవి అందెశ్రీ సందేశం ఇచ్చారు. సభకు అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షత వహించారు. తొలుత కె.వి.వి.సత్యనారాయణ బృందం ప్రదర్శించిన ఆముక్తమాల్యద నృత్య రూపకం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. 'మారుతున్న సామాజిక పరిస్థితుల్లో రచయితల పాత్ర' అనే అంశంపై ఆదికవి నన్నయ్య వేదికపై సిబిఐ పూర్వ జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ ప్రసంగించారు. అంతరించిపోతున్న

మిగతా 7లో

ఆధార్ అనుసంధానించకపోతే ఏప్రిల్ 1 నుంచి పాన్ కార్డులు పనిచేయవు

న్యూఢిల్లీ : పాన్ కార్డులకు ఆధార్ అనుసంధానించకపోతే 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి చెల్లవని కేంద్ర ఆదాయ పన్నుల శాఖ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. ఆదాయ పన్ను చట్టం 1961 ప్రకారం, మినహాయింపు వర్గం పరిధిలోకి రాని పాన్ హోల్డర్లందరూ మార్చి 31లోపు పాన్ కార్డును ఆధార్‌తో లింక్ చేయడం తప్పనిసరని, లింక్ చేయని పాన్‌కార్డులు ఏప్రిల్ 1 నుంచి పని చేయవని పేర్కొంది. సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (సిబిడిటి) మార్చి 30న జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం ఒకసారి పాన్ పనిచేయకపోతే ఐటి చట్టం ప్రకారం అన్ని పరిణామాలకు ఆ వ్యక్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని, పలు ఇబ్బందులను ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించింది. పని చేయని పాన్ కార్డును ఉపయోగించి ఐటి రిటర్నులను ఫైల్ చేయలేరని, పెండింగ్‌లో ఉన్న రిటర్న్‌లు ప్రాసెస్ చేయబడవని గుర్తు చేసింది. ఆ తరువాత పాన్ కార్డులను అనుసంధానించడం కూడా సాధ్యం కాదని తెలిపింది. అందువల్ల వెంటనే పాన్ కార్డులను, ఆధార్‌కు అనుసంధానించాలని కేంద్ర ఆదాయ పన్నుల శాఖ సూచించింది.

విద్యుత్తు చట్ట సవరణలతో తీవ్ర నష్టం

విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానించాలి : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి



కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రవేశ పెట్టిన విద్యుత్తు చట్టసవరణల బిల్లుతో ప్రజలకు తీవ్ర నష్టం కలగనుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్తు చట్టసవరణలను అనేక మంది ఎంపిలు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, వైసిపి దీనిపై నోరెత్తడం లేదని విమర్శించారు. విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించిందని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం కూడా విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో తీర్మానించాలని డిమాండ్ చేశారు. ఏ వినాశకర విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా కీర్తిశేషులు వైఎస్ఆర్ నాడు వామపక్షాలతో కలిసి ఆందోళన చేశారో ఆయన పేరు చెప్పుకుని ప్రభుత్వంలో ఉన్నవారు అవే సంస్కరణలను అమలు చేయాలనుకోవడం శోచనీయమన్నారు.

సత్ఫలితాలివ్వని వ్యవసాయ పంపు మోటర్లకు మీటర్ల ఏర్పాటు

వ్యవసాయ పంపు సెట్లకు ఉచిత విద్యుత్తు పథకానికి వైఎస్ఆర్ మొదటి సంతకం చేశారని, దానికి తూట్లు పొడుస్తూ మోడీ ఆదేశాలతో జగన్మోహన్‌రెడ్డి ఉరుకులు పరుగుల మీద వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేశారని శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో మీటర్లు ఏర్పాటు వల్ల 30 శాతం విద్యుత్తు ఆదాతోపాటు నాణ్యత పెరిగిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విద్యుత్తు సరఫరాలో హెచ్చు తగ్గుల వల్ల మోటర్లు కాలిపోతాయని తెలిపారు. మీటర్లు ఏర్పాటు చేసినంత మాత్రాన మోటార్లు కాలకుండా ఉంటాయా? అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు పిలిచిన టెండర్లలో ఎక్కడా పారదర్శకత లేదన్నారు. తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లలో పెట్టిన మీటర్లతో పోలిస్తే రెట్టింపు రేట్లకు కొని రూ.6 వేల కోట్ల ప్రజాధనాన్ని రాష్ట్ర ప్రభుత్వం వృథా చేసిందని విమర్శించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన మీటర్లలో 20 శాతం మీటర్లు కాలిపోయాయని, అటువంటప్పుడు 30 శాతం విద్యుత్తు ఆదా అయిందని

మిగతా 2లో

విద్వేషాల వ్యాప్తే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నైజం

- ప్రేమతో తిప్పికొడుతున్నామన్న రాహుల్‌గాంధీ
- ఢిల్లీకి చేరిన భారత్ జోడో యాత్ర
- సోనియా, ప్రియాంక, కమల్ హాసన్ హాజరు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



జోడో యాత్రలో కుమారుడు రాహుల్‌తో కలిసి నడుస్తున్న సోనియాగాంధీ

ప్రజల దృష్టిని వాస్తవ సమస్యల నుంచి మళ్లించేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి మత విద్వేషాలను ఒక ఆయుధంగా వినియోగిస్తున్నాయని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఆయన నేతృత్వంలోని భారత్ జోడో యాత్ర హర్యానా నుంచి శనివారం ఉదయం దేశ రాజధాని ఢిల్లీలో ప్రవేశించింది. 23 కిలోమీటర్ల యాత్ర అనంతరం ఎర్రకోట వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. వాస్తవ సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి బిజెపి ప్రభుత్వం హిందువులు, ముస్లిముల మధ్య విద్వేషాలను, భయాన్ని వ్యాప్తి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరిలో భయం ఉండాలని వారు కోరుకుంటారని, ఆ భయాన్ని ద్వేషంగా మారుస్తున్నారని, కాంగ్రెస్ మాత్రం అలా జరగనివ్వదని చెప్పారు. "కొందరు ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారు. మేము ప్రేమను వ్యాప్తి చేస్తున్నాం. దేశంలోని సామాన్యులు ఇప్పుడు ప్రేమ గురించి మాట్లాడుతున్నారు. భారతీయులందరినీ ఆలింగనం చేసుకుంటాం. ప్రతి రాష్ట్రంలో లక్షల మంది యాత్రలో చేరారు. యాత్రలో హిందుస్థాన్, 'మొహబ్బత్' (ప్రేమ) ఉంది. ఇది ఏ కులం, మతం, ధనిక, పేద అని చూడదు. అందరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటారు" అని రాహుల్ గాంధీ అన్నారు. "భారత్ జోడో యాత్రలో ప్రేమ, అహింస మాత్రమే ఉన్నాయి. ఈ యాత్ర కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు సాగి అక్కడ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తాం" అని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ప్రధాని మోడీది కాదని, అంబానీ, అదానీల ప్రభుత్వమని విమర్శించారు. 'ప్రధాని, బిజెపి తన ప్రతిష్టను నాశనం చేయడానికి వేల కోట్లు ఖర్చు చేశారని, ఒక నెలలోనే దేశానికి నిజం చూపించానని రాహుల్ అన్నారు. జోడో యాత్రలో ఐటిఒ వద్ద యాత్రలో ప్రముఖ నటుడు కమల్ హాసన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి కాంగ్రెస్‌వాది అని, తనకు రకరకాల భావజాలాలు ఉన్నాయని చెప్పారు. దేశం విషయానికి వచ్చేసరికి అన్ని రాజకీయ పార్టీల రేఖలు మసకబారిపోవాలని, ఆ రేఖను మసకబార్చి, ఇక్కడికి వచ్చానని చెప్పారు. భారత్ జోడో యాత్రను చూసి బిజెపి ప్రభుత్వం భయపడిపోయిందని, దానిని ఆపేందుకు కోవిడ్-19ని

మిగతా 7లో

గంజాయి దహనం

- గుంటూరు, విశాఖ రేంజ్ పరిధిలో కాల్చివేత

ప్రజాశక్తి - యంత్రాంగం

గుంటూరు, విశాఖ రేంజ్ పరిధిలో నమోదైన 1074 కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న 2,03,808 కేజీల గంజాయిని దహనం చేశారు. గుంటూరు రేంజ్ డిఐజి త్రివిక్రమ్ వర్మ, విశాఖ రేంజ్ డిఐజి హరికృష్ణ



ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం చేపట్టారు. బహిరంగ మార్కెటులో వీటి విలువ రూ.244 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. గుంటూరు రేంజ్ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం మరియు నెల్లూరు జిల్లాల్లోని ఆయా పోలీస్ స్టేషన్లలో నమోదైన 146 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 10,424.306 కేజీల గంజాయిని గుంటూరు జిల్లా మేడికొండూరు పోలీసు స్టేషన్ పరిధి పేరేచర్ల దగ్గర గల కైలాసగిరి పోలీస్ ఫైరింగ్ రేంజ్ వద్ద దహనం చేశారు. ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలు, విశాఖ రేంజ్ పరిధిలోని అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నమోదైన 929 కేసుల్లో పట్టుబడ్డ 1,93,384 కేజీల గంజాయిని, 133 కిలోల హశిష్ ఆయిల్‌ను అనకాపల్లి జిల్లా కేంద్రానికి సమీపంలోని కోడూరు గ్రామంలో దహనం చేశారు.





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

కుల దురహంకార హత్య...

- కాలిన శవమై తేలిన దళిత యువకుడు - భార్య తరపు బంధువులే హత్య చేశారని అనుమానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ యువకుని కుల దురహంకారం బలి తీసుకున్న ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. గోనెగండ్ల మండలం అల్వాల గ్రామానికి చెందిన మాదిగ గాడిబండ ఆమోస్ (27) 2017లో అదే గ్రామానికి చెందిన కుమ్మరి కులానికి చెందిన అరుణను అమ్మాయి తరపు వారు వ్యతిరేకించినా ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఒక బాబుకు జన్మనిచ్చారు.


మృతుడు ఆమోస్ (ఫైల్)

కుల దురహంకారమే బలి తీసుకుంది?

వివాహం చేసుకున్న అనంతరం కొంతకాలం పాటు వారి వివాహ బంధం సాఫీగా కొనసాగింది. ఏడాది క్రితం కర్నూలు నగరంలోని రామచంద్రనగర్‌లో ఇల్లు తీసుకుని స్పెన్సర్స్ షాపింగ్ మాల్‌లో భార్యాభర్తలిద్దరూ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌గా జాబ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కాలంలోనే వారి ఇరువురి మధ్య చిన్నపాటి తగాదాలు కుటుంబ కలహాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో భార్య అలిగి పది రోజుల క్రితం తల్లిదండ్రుల ఇంటికి వెళ్ళింది. ఈ నేపథ్యంలో భార్యను కాపురానికి రమ్మని తీసుకువచ్చేందుకు మామ ఇంటికి వెళ్లి పిలవగా మామకు మృతునికి మధ్య మాటల యుద్ధం, చిన్నపాటి ఘర్షణ ఏర్పడింది. ఇదివరకే మృతుని మామ మనసులో కుల దురహంకారం గూడు కట్టుకుని ఉంది. నీ కథ తెలుస్తానంటూ హెచ్చరికలు కూడా చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే కొద్ది రోజుల ముందు ఆమోష్ మామ తరుపు బంధువులు కూడా హత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తిరిగి ఇంటికి వచ్చిన భార్య అరుణకు ఎప్పటిలాగే తన ఉద్యోగం కోసం హాజరైన అమోసు గురువారం రాత్రి పని ముగించుకొని ఇంటికి వస్తున్నాను వంట సిద్ధం చేయమని భార్య అరుణకు ఫోన్ చేసి చెప్పాడు. ఎంత సేపటికి భర్త రాకపోవడంతో అరుణ అత్తమామలకు ఫోన్ చేసి ఇంటికి రాలేదని సమాచారం అందించింది. శుక్రవారం కూడా ఎదురుచూసిన ఫలితం లభించలేదు. అమోస్ షరీఫ్ నగర్ హంద్రీ బ్రిడ్జి వద్ద శనివారం దగ్ధమైన శరీరం బయటపడడం అనుమానాలను బలపరుస్తుంది. శుక్రవారం ఆమోస్ మామ వారి ఇంటి వద్ద తచ్చాడినట్లు బంధువుల సమాచారం. మృతుడికి తల్లిదండ్రి భార్య నాలుగేళ్ల కుమారుడు వివాహం కావాల్సిన చెల్లి ఉన్నారు.


పోస్టుమార్టం చేసిన మృతదేహాన్ని స్వగ్రామానికి తరలిస్తున్న బంధువులు

కోవిడ్ ఫోర్త్ వేవ్ ఎదుర్కొనేందుకు చర్యలు

- కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కోవిడ్ ఫోర్త్ వేవ్ హెచ్చరికల నేపథ్యంలో ఆస్పత్రుల్లో వైద్యం అందించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుని, ఎలాంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, అప్రమత్తంగా ఉండాలన్నారు. కోవిడ్ నివారణకు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. కోవిడ్ రోగుల అడ్మిషన్స్‌కు ఐసియుబెడ్స్, నాన్ ఐసియు బెడ్స్ ఏర్పాటు, తదితర అంశాలన్నీ యాక్షన్ ప్లాన్ ప్రకారం సిద్ధం చేసుకోవాలని, జిజిహెచ్ సూపరింటెండెంట్ నరేంద్రనాథ్ రెడ్డిని ఆదేశించారు. టెస్టింగ్, వాక్సినేషన్ పై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. డిఎంహెచ్ఒ రామగిడ్డయ్య, జిజిహెచ్ సూపరింటెండెంట్ నరేంద్రనాథ్‌రెడ్డి, డిసిహెచ్ఎస్ లింగన్న తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి : సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శనివారం కర్నూలు నగరంలోని 49, 50, 52వ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ప్రసాద్ ఉన్నారు.

తెరపైకి ఇట్టినా ప్లాంటేషన్ భూవివాదం

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి కర్నూలు

జిల్లాలోని ఆస్పరి మండలం ఆస్పరి, చిన్న హోతూరు, ఆలూరు మండలంలోని పెద్ద హోతూరు గ్రామాల్లో పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ఇట్టినా అనే ప్రయివేట్ సంస్థ పేరుతో రైతుల దగ్గర నుంచి 2005లో భూములను సేకరించారు. మంత్రి తాజా ప్రకటనతో ఇట్టినా సేకరించిన భూములు మళ్లీ చర్చనీయాంశమైంది. దాదాపు 170 మంది రైతుల నుంచి 454.37 ఎకరాల భూమిని బెంగళూరుకు చెందిన ఇట్టినా ప్లాంటేషన్ కంపెనీ పేరుతో ఎకరా రూ.22 వేలతో కొనుగోలు చేశారు. ఈ వ్యవహారంలో మంత్రి గుమ్మనూరు భార్యకు ఇడి నోటీసులు ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. మంత్రి దానిని ఖండించారు. తాజాగా ఆయన ఇట్టినా కంపెనీ నుంచి వంద ఎకరాలు కొన్నది వాస్తవమేనని ఒప్పుకున్నారు. మార్కెట్ ధరకే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తానని చెప్పారు. ప్రస్తుతం ఆ భూముల మార్కెట్ విలువ రూ.3.5 లక్షలకు పైగానే ఉంది. దీనిపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అప్పుడు కొన్న ధరకే ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. అయితే కమ్యూనిస్టుల దగ్గరకు వెళ్లకుండా తనను ఆశ్రయిస్తే భూమి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తానని మంత్రి అంటున్నారు. ఎంతధరకు ఇస్తారు. ఎలా ఇస్తారనేది...ఇస్తారా లేదనేది ఆచరణలో చూడాల్సిందే. మాండూస్ తుఫాన్, నకిలీ పత్తివిత్తనాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు, రైతు సంఘాలనేతలు నిరసన తెలిపారు. సిపిఐ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల అన్ని రాకల సమస్యలు పరిష్కరించాలని పాదయాత్ర చేసి కర్నూలులో ప్రదర్శన నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, అఖిలభారత రైతు సంఘం నాయకులు హాజరయ్యారు. సిపిఎం సంఘీభావం తెలిపింది. జంట మహిళల హత్య కేసు నిందితులను శిక్షించాలని ఐద్వా, ప్రజాసంఘా ఆధ్వర్యంలో కలెక్టరేట్ఎదుట నిరసన తెలిపారు. విజయవాడలకు రెగ్యులర్ ఇంటర్‌సిటీ రైలును నడపాలని ఇటీవల కర్నూలుకు వచ్చిన రైల్వే జిఎంకు సిపిఎం వినతిపత్రం అందజేసింది. రైల్వే పెండింగు ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేసింది. ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల వయో పరిమితి పెంచాలని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులకు, టీచర్లకు ఉన్నట్లుగా సర్పంచులకు ప్రత్యేక ఓటుహక్కు కల్పించాలని సర్పంచుల సంఘం డిమాండ్ చేసింది. నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలో జరిగిన ఒక సమావేశంలో సర్పంచుల సంఘం రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. టిడిపి ఇఒ ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళిరెడ్డి(28) గుండెపోటుతో మృతిచెందాడు. అంత్యక్రియలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ముఖ్యమంత్రి జన్మదిన వేడుకల పేరుతో జిల్లాలో మూడు రోజులపాటు కార్యక్రమాలు చేశారు. విద్యార్థులకు క్రీడలపోటీలు నిర్వహించారు. రెండోరోజు మొక్కలు నాటారు. మూడోరోజు రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

అవి..ఇవి...అన్నీ....: ఒక ఇంట్లో నిలువ ఉంచిన బాణసంచాపేలి ఒక యువకుడు మృతిచెందాడు. వెల్దుర్తి మండలంలో అప్పుల బాధ తాళలేక యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్‌టిసి ఉద్యోగులకు రావల్సిన పాతబకాయిలు చెల్లించాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో డిపోల ముందు ధర్నా చేశారు. రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. వినియోగదారుల వారోత్సవాలు విద్యాసంస్థల్లో నిర్వహించారు. పోలీస్ వార్షికోత్సవ తనిఖీలను ఉన్నతాధికారులు నిర్వహించారు. బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి రాయలసీమ మేథావుల సమ్మేళనం పేరుతో మళ్లీ తన ఉనికిని చాటుకున్నారు. ఉద్యోగ సంఘాల అమరావతి జెఎసి రాష్ట్ర మహాసభలను కర్నూలులో నిర్వహించేందుకు సన్నాహక సమావేశాలు నిర్వహించింది. రాష్ట్ర నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఎబివిపి రాష్ట్ర మహాసభలను కర్నూలు వేదికగా నిర్వహించింది. అధికార వైసిపి ఎమ్మెల్యేలు గడపగడపకు మన ప్రభుత్వం పేరుతో ఇంటింటికి వెళ్లి సందడి చేస్తున్నారు. ఇదేంఖర్మ రాష్ట్రానికి పేరుతో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జుల పేరుతో ప్రజల వద్దకు వెళ్తున్నారు. సెమీ క్రిస్మస్ వేడుకలను విద్యాసంస్థలు, రాజకీయ పార్టీల నాయకులు నిర్వహించారు.



నిందితులను కఠినంగా శిక్షించాలి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కులాంతర వివాహం చేసుకున్న ఎనిమిదేళ్లకు కరుడుగట్టిన కుల దురహంకారంతో చంపి, నిప్పంటించిన కిరాతకులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. మూడు రోజుల క్రితం గోనెగండ్ల మండలం, అల్వాల గ్రామానికి చెందిన 26 సంవత్సరాల దళితుడైన గాడిబండ ఆమోష్‌ను కర్నూలు నగరంలోని షరీన్ నగర్ హంద్రీ కట్ట వద్ద అత్యంత కిరాతకంగా నరికి చంపి, ఆ తర్వాత కాల్చివేసిన మతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల మార్చురీలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు తో పాటు జిల్లా ఉపాధ్యక్షులు డి.విజయమ్మ, ఎన్‌జి.కృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆర్.పెద్దబాబు, ఆంధ్రా గురుస్వామి, జిల్లా కమిటీ సభ్యులు జి.యేసురాజు, చిన్న రోశన్న, కె.వెంకటస్వామి, బతకన్నలు, కెవిపిఎస్ ప్రతినిధి బృందంగా పరిశీలించి నివాళులర్పించారు. అనంతరం కార్మిక కర్షక భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో దళితులపై అంటరానితనం, కుల వివక్షత, కుల దురహంకార నరమేధం నిత్య కృత్యంగా కొనసాగుతోందన్నారు. నందవరం మండలం, గురజాల గ్రామానికి సంబంధించిన ఫిజియోథెరపిస్ట్ బుడ్డన్న హత్యాగాయం మానక ముందే గోనెగండ్ల మండలం అల్వాల గ్రామానికి చెందిన గాడిబండ ఆమోస్‌ను అతి కిరాతకంగా చంపడం దారుణమన్నారు. జిల్లాలో అంటరాని తనం జడలు విప్పుకొని సమాజాన్ని నాశనం చేస్తుంటే అధికారులకు మాత్రం చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. మనుషులందరూ సమానమే అంటూ పౌరహక్కుల దినాన్ని గ్రామాలవారిగా జరపడంలోనూ అధికారులు విఫలమవుతున్నారన్నారు. కులాంతర వివాహం చేసుకున్న ఎనిమిదేండ్ల తర్వాత నాలుగు సంవత్సరాల కుమారుడు ఉన్నా.. లెక్కలేకుండా కిరాయి గుండాల చేత తమ కుమారుడిని హత్య చేయించారని మృతుడి తల్లిదండ్రులు రోధిస్తూ చెప్పారన్నారు. హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని లేనిచో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

జువెనైల్ హోంను సందర్శించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి -కర్నూలు లీగల్

జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సిహెచ్.వెంకట నాగ శ్రీనివాస రావు శనివారం కర్నూలు జువెనైల్ హోంను తనిఖీ చేశారు. కార్యాలయానికి సంబంధించిన రిజిస్టర్‌లను పరిశీలించి అక్కడ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో కార్యదర్శి సిహెచ్.వెంకట నాగ శ్రీనివాస రావు చట్టంతో వివేదించబడిన బాలలకు సంబంధించిన చట్టాలను, ఉచిత న్యాయ సహాయం గురించి తెలియజేశారు. రక్షణ, సంరక్షణ అవసరమైన బాలల గురించి బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ జుబేద బేగంతో మాట్లాడారు. జిల్లా పర్యవేక్షణ అధికారి సుదర్శన్ రెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్స్, చట్టంతో వివేదించబడిన బాలురు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న వెంకట నాగశ్రీనివాసరావు

నేడు రెగ్యులర్ మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

సుందరయ్య స్ఫూర్తికేంద్రం ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ నగర్ లోని సుందరయ్య భవన్‌లో ఆదివారం ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు నిర్వహిస్తారని సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జెఎన్ శేషయ్య, చైర్మన్ కె. ప్రభాకర్ రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో ప్రకటనలో కోరారు. మెడికల్ క్యాంపులో ప్రముఖ వైద్యులు గోపాలం, శివన్నారాయణ, డాక్టర్లు భరత్, వినోద్, సంధ్య, నాగభూషణరావు, పర్వీన్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ మెడికల్ క్యాంపులో తక్కువ ధరకే రెండు నెలలు సరిపడా మందులు పేషెంట్లకు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు , సమీప మండలాలు ,గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు.


ప్రజాశక్తి 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ , ప్రజాశక్తి సిబ్బంది

ప్రజాశక్తి 2023 క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజాశక్తి ఆధ్వర్యంలో ప్రచురించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హఫీజ్ ఖాన్ శనివారం నగరంలోని స్థానిక ఒకటో వార్డులోని తన నివాసంలో ప్రజాశక్తి సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. వాస్తవాలను ప్రచురించే పత్రికగా ప్రజాశక్తి మరింత ఉన్నతంగా అభివద్ధి చెందాలని ఆయన కాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి సిబ్బందికి, ప్రజలకు ఆయన నూతన సంవత్సర ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాశక్తి మేనేజర్ నరసింహ డెస్క్ న్యూస్ ఇన్చార్జి పానుగంటి చంద్రయ్య, జిల్లా ఎం.ఇన్చార్జి ఎం.రాజు డివిజన్ ఇన్చార్జి ఎలా గౌడ్ విలేకరులు మునిస్వామి, యూసుఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిది జనరంజక పాలన : ఎమ్మెల్యే హాఫీస్ ఖాన్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో వైసిపి జన రంజక పాలన సాగిస్తోందని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హఫీజ్ ఖాన్ అన్నారు. శనివారం కర్నూలు నగరంలోని 25వార్డు 63, 64వ సచివాలయం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ, ఠాగూర్ నగర్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ నాయకులు వైఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రజలకు కావలిసిన ప్రతి అవస రానికి అనుగుణంగా సంక్షేమ పథకాలతో ఆదుకుంటు న్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా చాలా మంది ఉచితంగా హాస్పిటల్స్ నందు ఎన్నో రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుంటున్నారన్నారు. జగనన్న ప్రతి ఇంటికి పెద్ద దిక్కుకుగా ప్రతి కష్టంలో తోడుగా నిలుస్తున్నాడని, స్వయంగా ప్రజలు ఈ విషయాన్ని తెలుపుతున్నారన్నారు. సచివాలయం వ్యవస్థ ద్వారా ప్రతి పని ఇంటి దెగ్గరే గంటల వ్యవధిలో పనులు పూర్తి అవుతున్నాయని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం ఆధ్వర్యంలో నేడు రోడ్లు, మంచినీటి సౌకర్యం, వీధి దీపాలు ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తుందన్నారు. విద్య వ్యవస్థలో విప్లవత్మక మార్పులు తీసుకొస్తోందని, అన్నారు. జగనన్నను దీవించి మళ్లీ గెలిపించాలని కోరారు. వార్డు కార్పొరేటర్ వైసిపి నగర అధ్యక్షులు సత్య నారాయణమ్మ, గడ్డం రామకృష్ణ, 22వ వార్డ్ కార్పొరేటర్ మొయిన్, జయచంద్రా రెడ్డి, విజయలక్ష్మి , బాజీద్, అక్బర్, సచివాలయం సిబ్బంది మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు పూలమాల వేసి స్వాగతం పలుకుతున్న వార్డు నాయకులు


విజేతలకు జ్ఞాపికను, సర్టిఫికెట్‌ను అందజేస్తున్న డిఆర్ఒ నాగేశ్వరరావు

ప్రతి వస్తువు కొనుగోలుకు బిల్లు తీసుకోవాలి

డిఆర్ఒ నాగేశ్వరరావు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్ : వినియోగదారులు ప్రతి వస్తువు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.నాగేశ్వర రావు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సర్వ శిక్షా అభియాన్ హాల్‌లో నిర్వహించిన జాతీయ వినియోగదారుల దినోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వర రావు మాట్లాడుతూ సమాజంలో ప్రతి వినియోగదారుడు తన హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడ ఉన్న విద్యార్థులు అందరూ కూడా క్షేత్రస్థాయిలో వినియోగదారులకు వినియోగ హక్కు చట్టం గురించి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు నారాయణ రెడ్డి మాట్లాడారు. ఈ నెల 23న కెవిఆర్ కళాశాల , ప్రభుత్వ పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ , ఉర్దూ భాషల్లో నిర్వహించిన వ్యాస రచన పోటీలు , వక్తృత్వ పోటీలలో మన జిల్లా నుండి రాష్ట్ర స్థాయి మొదటి బహుమతి, రెండవ బహుమతి, మూడోవ బహుమతికి కెవిఆర్ కళాశాల నుండి ముగ్గురు ప్రభుత్వ పాఠశాల నుండి ముగ్గురు ఎంపిక అవ్వడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం వినియోగదారుల హక్కు చట్టం మీద జిల్లా స్థాయిల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన 36 మంది విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు నసీమ కౌసర్, వినియోగదారుల రక్షణ కమిటీ సెక్రెటరీ శివమోహన్ రెడ్డి, వినియోగదారుల సంఘం సభ్యులు, ప్రభుత్వ పాఠశాల మరియు కెవిఆర్ విద్యార్థినులు, పౌరసరఫరాల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను విస్మరిస్తే పతనం తప్పదు

భవన నిర్మాణ కార్మిక సంఘం హెచ్చరిక

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : భవన నిర్మాణ కార్మికులను వారి సంక్షేమాన్ని విస్మరిస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే వైసిపికి పడుతుందని భవన నిర్మాణ సంఘం సిఐటియు నాయకులు హెచ్చరించారు. కర్నూలు నగరంలోని బిర్లాగడ్డ మట్టి పని అడ్డాలో భవన నిర్మాణ కార్మికుల సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.సుధాకరప్ప, నగర కార్యదర్శి ఆర్.నరసింహులు, సిఐటియు నగర నాయకులు బి.రాధాకృష్ణ, జి.ఏసు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాయుడు సంక్షేమ నిధులు తన సొంత పథకాలకు మళ్లించిన విధంగా జగన్ ప్రభుత్వం నేనేమీ తక్కువ కాదంటూ రూ.825 కోట్లు దారి మళ్లించి సంక్షేమ పథకాలను ఇవ్వకుండా ఆపివేసి భవన నిర్మాణ కార్మికులకు తీరని ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. అంతేకాకుండా గత రెండేళ్లుగా సంక్షేమ బోర్డు ద్వారా మంజూ రయిన నిధులు లేక ఆగి పోయిన సంక్షేమ పథ కాలకు నిధులు విడుదల చేయా లని తిరిగి సంక్షేమ పథకాలు కొనసాగించా లన్నారు. నాయ కులు శ్రీనివాసులు మట్టి పని కార్మికులు పాల్గొన్నారు.కార్మికులకు సభ్యత్వం ఇస్తున్న సిఐటియు నాయకులు సుధాకరప్ప, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వం చేర్పిస్తున్న నాయకులు సుదాకరప్ప, నర్సిములు


విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి, డిఇఒ వెంకటరంగారెడ్డి

పత్తికొండ హైస్కూలులో ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి-పత్తికొండ : కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేశామని, ఆస్థాయి విద్యను అందుకునేందుకు విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేస్తున్నామని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించామని కార్పొరేట్ విద్యా వ్యవస్థతో పోటీపడే విధంగా ఉండాలని, అందుకే మధ్యాహ్న భోజనం పథకంలో మార్పులు తెచ్చామని, ప్రతిరోజూ మెనూను ఖచ్చితంగా అమలు చేయాలని మండల విద్యాధికారికి ఎమ్మెల్యే శ్రీదేవి ఆదేశించారు. అందరు పిల్లలు కూడా బాగా చదవాలని, చదువుల విప్లవం తేవాలని, పేదవారు ఎవరు చదువు దూరం కాకూడదని ఇంగ్లీష్ మీడియం విద్యాబోధన ప్రవేశ పెట్టామని తెలిపారు. అనంతరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు డిఇఒ రంగారెడ్డి, ఎమ్మెల్యే శ్రీదేవి ట్యాబుల పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్నం భోజనం తనిఖీ చేసి నాణ్యతతో పిల్లలకు మెనూ ప్రకారం వడ్డించాలన్నారు. ఎంఇఒ మస్తాన్‌వలి, పత్తికొండ ఎంపిపి నారాయణదాసు, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడుమూరులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-కోడుమూరు :

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 12 వ మహాసభలు జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ అన్నారు. కోడుమూరు సుంద రయ్య భవన్‌లో జనవరి 7-8 తేదీల్లో జరిగే బహిరంగ సభ కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు మూడేళ్లకోసారి జరుగతాయన్నారు. మహాసభలలో గత కార్యక్రమాలు చర్చించి భవిష్యత్తు కర్తవ్యం రూపొందిస్తామని అన్నారు. దేశంలో మోడీ, రాష్ట్రంలో జగన్ ప్రభు త్వాలు పేదలను దోపిడీ చేసి పెద్దలకు పెడుతున్నారన్నారు. జిల్లాలో వ్యవసాయ పనులు లేక సుదూర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారని, వలసలు అరికట్టేందుకు చర్యలు లేవన్నారు. పేదలకు పట్టేడు అన్నం పెట్టే ఉపాధిహామీ పథకం నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. ఇంకా జిల్లా అభివృద్ధి కోసం అనేక అంశాలు చర్చించ బోతు న్నామని అన్నారు. కోడుమూరులో జనవరి 7న బహిరంగసభ నిర్వహిస్తామన్నారు.

అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి, జిల్లా నాయ కులు పాల్గొంటున్నారని తెలిపారు. వ్యవసాయ కూలీలు పేదలు అధిక సం ఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బహిరంగ సభ కరపత్రం విడు దల చేసినవారిరో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఎ.గఫూర్ మియా, చేనేత సంఘం జిల్లా కార్యదర్శి కె.రాజు ఆహ్వాన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.వీరన్న ,అశోక్ తదితరులు పాల్గొన్నారు.


మహాసభల కరపత్రాన్ని విడుదల చేస్తున్న నారాయణ తదితరులు

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు కలెక్టర్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని క్రైస్తవులకు ప్రముఖులు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు బుగ్గనరాజేంద్రనాథ్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం, జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు, మేయర్ బివై.రామయ్య, డిసిసి అధ్యక్షుడు సుధాకర్ బాబు శనివారం విడుదల చేసిన ఓ ప్రాంతంలో పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగ వేడుకలను ఆనందంగా, సుఖ సంతోషాలతో జరుపుకోవాలని వారు కోరారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

సుస్థిర అభివద్ధి లక్ష్యాల సాధించాలని జిల్లా కలెక్టర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శనివారం కర్నూలు నగరంలోని 49, 50 52 సచివాలయాలను లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ సచివాలయ సిబ్బంది రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట మునిసిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత : వైసిపి

ప్రజాశక్తి - చిప్పగిరి


విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న నాయకులు

విద్యాభివృద్ధికి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ, ఎంపిపి భర్త జూటూరు మారయ్య, చిప్పగిరి సర్పంచి దాసరి గోవిందరాజులు తెలిపారు. శనివారం చిప్పగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రఘునాథ్, దాసరి గోవిందరాజులు ఆధ్వర్యంలో 5వ తరగతికి నాడు-నేడు ద్వారా రూ.68 లక్షలతో అదనపు గదులు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులకు జగనన్న ఉచిత ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ, ఎంపిపి భర్త జూటూరు మారయ్య హాజరయి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో ఏ పథకానికీ మంజూరు కానీ నిధులు ఒక్క విద్యాభివృద్ధికే నాడు-నేడు పథకం ద్వారా అధిక నిధులను విడుదల చేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు ఎమ్‌డి.ఫరూక్, రంగనాయకులు, రామాంజనేయులు, కస్తూరిబా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షబానా, వైసిపి నాయకులు, గుంతకల్లు సూరి, రాజన్న, శ్రీధర్ పాల్గొన్నారు.

టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - నందవరం

ప్రస్తుత ఆధునిక యుగంలో విద్యార్థులు టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. శనివారం నందవరం జడ్‌పిహెచ్ స్కూల్‌లో 8వ తరగతి చదివే విద్యార్థులకు 120 ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చదువుకు పేదరికం అడ్డు కాకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమ్మఒడి, విద్యా వసతి, విద్యా దీవెన పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదివే ప్రతి విద్యార్థికీ బైజూస్ లెర్నింగ్ యాప్‌తో ట్యాబ్ ద్వారా డిజిటల్ విద్యనభ్యసించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. విద్యార్థులు చదువులో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. మండలంలోని 7 ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 788 విద్యార్థులకు ట్యాబ్‌లు వచ్చాయని ఎంఇఒ సుదర్శన్ రెడ్డి తెలిపారు. అలాగే పాఠశాలల్లో చదివే వికలాంగులకు అవసరమైన పరికరాలు అందించారు.

అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలి

- ఎంపిడిఒకు అఖిలపక్షం వినతి

ప్రజాశక్తి - దేవనకొండ


వినతిపత్రం అందిస్తున్న అఖిలపక్ష నాయకులు

ఈనెల 30న జరిగే మండల సర్వసభ్య సమావేశానికి హంద్రీనీవా అధికారులను తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు కోరారు. శనివారం టిడిపి సర్పంచులు, ఎంపిటిసిలు, సిపిఎం, సిపిఐ నాయకులు కలిసి ఎంపిడిఒ గౌరీ దేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, సిపిఎం జిల్లా నాయకులు వీర శేఖర్, సిపిఐ మండల కార్యదర్శి నరసరావు మాట్లాడారు. మార్చి చివరి దాకా రబీ పంటలకు సాగునీరందిస్తామని హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు మండల సర్వసభ్య సమావేశంలో హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిడిపి సర్పంచులు భాస్కర్, చిన్న రామప్ప, మహేశ్వర్ రెడ్డి, శేషి రెడ్డి, హనుమంతు, ఎంపిటిసిలు తిమ్మప్ప, సిపిఎం నాయకులు బజారి, కెపి.రాముడు, అశోక్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - గోనెగండ్ల


ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

గోనెగండ్లలోని సర్వే నెంబర్ 601 జగనన్న కాలనీలో ఆక్రమణలను శనివారం అధికారులు జెసిబి ద్వారా తొలగించారు. కస్తూరిబా పాఠశాల వెనుక ఉన్న జగనన్న కాలనీలో పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా 266 మందికి పట్టాలు పంపిణీ చేశారు. ఇందులో 120 మంది గృహ నిర్మాణాలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో తమకు కేటాయించిన ప్లాట్‌లను కొంతమంది ఆక్రమించుకున్నారని బోయ శ్వేత, కటిక మాబీ అనే లబ్ధిదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు తహశీల్దార్ వేణుగోపాల్, ఎఎస్‌ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో హౌసింగ్ సిబ్బందితో కలిసి జెసిబి ద్వారా కొంతమంది ఏర్పాటు చేసుకున్న బండలు, రేకుల షెడ్లను తొలగించారు.

నిర్మాణాలు త్వరగా చేపట్టాలి

జగనన్న కాలనీలో లబ్ధిదారులు చేపట్టిన నిర్మాణాలను తహశీల్దారు వేణుగోపాల్, హౌసింగ్ డిఇ ఎస్వీ.ప్రసాద్ పరిశీలించారు. ఇంటి నిర్మాణాలను త్వరగా చేపట్టి నాణ్యతతో నిర్మించుకోవాలని తెలిపారు. నిర్మాణ పురోగతిని బట్టి బిల్లులను వెంటనే అందజేస్తామని చెప్పారు. హౌసింగ్ ఎఇ లక్ష్మన్న, ఆర్‌ఐ సునీల్, ఇంజినీరింగ్ సిబ్బంది షాషావలీ, వినోద్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ప్రజాశక్తి- హొళగుంద

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. 'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా శనివారం హొళగుంద సచివాలయం-3, రైతు భరోసా కేంద్రం-3ను ప్రారంభించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బైజూస్ ట్యాబ్‌లను 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాడు-నేడు ద్వారా అదనపు గదుల నిర్మాణం, పాఠశాల చుట్టూ ప్రహరీ, ప్రతి విద్యార్థికీ బట్టలు, బూట్లు, పాఠ్యపుస్తకాలతో పాటు నోటుబుక్కులు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అంతకుముందు సులువాయి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వైసిపి ఆలూరు తాలూకా ఇన్‌ఛార్జి నారాయణస్వామి, ఎంపిడిఒ దాసు నాయక్, ఎంఇఒ ఈరన్న, ఆలూరు మండల కన్వీనర్ వీరేష్, హొళగుంద మండల కన్వీనర్ షఫీవుల్లా, ఎంపిపి తనయుడు ఈశా, జడ్‌పి వైస్ ఛైర్మన్ బావ శేషప్ప, రామకృష్ణ, కుమార స్వామి, తోక వెంకటేష్, అబ్దుల్ సుభాన్ పాల్గొన్నారు.


విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న మంత్రి జయరాం

పరువు హత్య అమానుషం

- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దళితుని పరువు హత్య చేయడం అమానుషమని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం తెలిపారు. శనివారం స్థానిక కెవిపిఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కర్నూలు నగరంలోని 4వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో గోనెగండ్ల మండలం అల్వాల గ్రామానికి చెందిన గాడిబండ చిన్న నరసన్న కుమారుడు గాడిబండ ఆమోస్ (26)ను అతి కిరాతకంగా హత్య చేసి పెట్రోల్ పోసి నిప్పంటించారని తెలిపారు. హత్యకు కారకులైన వారిని పోలీసులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆరేళ్ల క్రితం అల్వాల గ్రామానికి చెందిన కుమ్మరి గోపాల్ కుమార్తె కుమ్మరి అరుణను ఆమోస్ కులాంతర వివాహం చేసుకున్నారని తెలిపారు. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడని చెప్పారు. కులాంతర వివాహం కావడంతో గ్రామం వదిలి ప్రశాంతంగా జీవిస్తున్న ఆమోస్‌ను సహించని అమ్మాయి తల్లిదండ్రులు కిరాయి హంతకులతో పరువు హత్యకు పాల్పడ్డారని తెలిపారు. నాడు గురజాల, నేడు అల్వాల అని, దళితులపై పరువు హత్యలు కొనసాగుతున్నా రక్షణ కల్పించడంలో పోలీసులు, ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందారని మండిపడ్డారు. పరువు హత్యకు గురైన గాడిబండ ఆమోస్ కుటుంబా నికి న్యాయం జరిగే వరకు జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. కెవిపిఎస్ మండల ఉపాధ్యక్షులు సోగనూరు తిమ్మన్న, నందవరం మండలం ఎస్సీ కాటి కాపరుల సంఘం నాయకులు మాచాపురం మాల గంగన్న, కనకవీడు దేవపుత్ర పాల్గొన్నారు. **గోనెగండ్ల**లో కెవిపిఎస్ మండల కార్యదర్శి కరుణాకర్ మాట్లాడారు. కెవిపిఎస్ నాయకులు మునిస్వామి దేవదాసు నాగరాజు ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దేవ సహాయం

గృహ నిర్మాణ పనులు వేగవంతం

- జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయం సేవలు పెంచాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందేలా కృషి చేయాలని తెలిపారు. జగనన్న గృహాల నిర్మాణంలో నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో అర్హుడైన వ్యక్తికి ప్రభుత్వ పథకాలు అందించే బాధ్యత తమపై ఉందన్నారు. ఎంపిడిఒ జగన్‌మోహన్ రెడ్డి, ఇన్‌ఛార్జీ తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

హాల్విని సందర్శించిన సిఇఒ : మండలంలోని హాల్వి గ్రామంలో నాడు-నేడు పనుల్లో భాగంగా పాఠశాల గోడ పడిపోయి విద్యార్థులకు గాయాలైన సందర్భంగా జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి సందర్శించారు. శనివారం ఆయన సంఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.



గడ్డి వామి దగ్ధం...

- రూ.60 వేలు నష్టం....

ప్రజాశక్తి-హాలహర్వి

మండలంలోని బాపురం గ్రామంలో రాఘవేంద్రస్వామి అనే రైతుకు చెందిన గడ్డివామి శనివారం దగ్ధమైంది. స్థానిక రైతులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రూ.60 వేల వరకు ఆస్తినష్టం జరిగిందని రైతు వాపోయారు. నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

చంద్రబాబుకు పెరుగుతున్న ఆదరణ

- వణకుతున్న పాలకులు - మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

చంద్రబాబు ఎక్కడ సభలు నిర్వహించినా ప్రజలు స్వచ్ఛందంగా తండోపతండాలుగా వస్తున్నారని, ఆదరణను చూసి పాలకుల వెన్నులో వణుకు పుడుతోందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. శనివారం పట్టణంలోని 38, 41వ వార్డుల్లో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' నిర్వహించారు. అంతకుముందు పంచముఖ ఆంజనేయ స్వామి గుడిలో పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం టిడిపి నాయకులు, క్లస్టర్ యూనిట్ సభ్యులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుద్యోగ సమస్య, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి కావాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని చెప్పారు. రాష్ట్రం సస్యశ్యామలం కావాలంటే టిడిపితోనే సాధ్యమన్నారు. ముఖ్యమంత్రి జగన్ సంక్షేమం పేరుతో కొందరికే లబ్ధి చేకూరుస్తూ అందరికీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపడం ఖాయమని జోష్యం చెప్పారు. నాయకులు బిచ్చ అంజినప్ప, రంగన్న, నరసింహులు, మహాదేవా, ప్రభు, నాగార్జున, హరి, అంజి, మల్లికార్జున, బుద్ధారెడ్డి, తిమ్మప్ప, రవి, వెంకటేష్, సుబ్బు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లో మున్సిపల్ టిడిపి ఫ్లోర్ లీడర్, 21వ వార్డు కౌన్సిలర్ విజిఎ.దయాసాగర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 103, 104వ బూత్ ఇన్‌ఛార్జీలు గడ్డం రవి, రాజశేఖర్, వార్డు ఇన్‌ఛార్జీ హుస్సేన్ పీరా పాల్గొన్నారు. అలాగే 30వ వార్డు ఇన్‌ఛార్జీ, మాజీ కౌన్సిలర్ ఎం.మధు బాబు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డు అధ్యక్షులు ఇప్పే నరసప్ప, పట్టణ సెక్రటరీ మిన్నప్ప, వార్డు ప్రధాన కార్యదర్శి రఫీ, జెట్టప్ప, టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు నరేష్, నాగప్ప, వాల్మీకి శివకుమార్, వడ్ల వెంకటేష్, రాము, వెంకటపతి పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని మధిర, పొదలకుంట గ్రామాల్లో టిడిపి మంత్రాలయం సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, హాల్వి గ్రామంలో టిడిపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ అడివప్ప గౌడ్, కౌతాళంలో టిడిపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, ఇన్‌ఛార్జీ వెంకటపతి రాజు ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ' నిర్వహించారు. గోవిందు, రహిమాన్, సిద్ధప్ప, రాజానందు, కాశీ విశ్వనాథ్, మంజు, దర్గా మౌలా, వడ్డే ఉసేని, మల్లప్ప పాల్గొన్నారు.


ఆదోనిలో ప్రభుత్వ లోపాలను వివరిస్తున్న మీనాక్షి నాయుడు


ఎమ్మిగనూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


కౌతాళంలో మాట్లాడుతున్న ఉల్లిగయ్య

రాయలసీమపై నిర్లక్ష్యం

- ఎల్ఎల్‌సి మాజీ డైరెక్టర్ నారాయణరెడ్డి

ఫొటో:- మాట్లాడుతున్న గడ్డం నారాయణరెడ్డి

ప్రజాశక్తి - నందవరం



రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం రాయల సీమపై నిర్లక్ష్యం వహిస్తోందని టిడిపి నాయకులు, ఎల్ఎల్‌సి మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగేళ్లు కావస్తున్నా ఒక్క ప్రాజెక్టుకు కూడా పిడికెడు మట్టి వేసిన పాపాన పోలేదని విమర్శించారు. ముఖ్యంగా కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో కరువు విలయతాండవం చేస్తున్నా ఏ మంత్రి కానీ, ఎమ్మెల్యే కానీ రైతులను పలకరించిన దాఖలాలు లేవని మండిపడ్డారు. జిల్లాలోని ఆర్‌డిఎస్ గురించి ఏ ఒక్క నాయకుడూ మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. 70 ఏళ్ల ప్రాజెక్టును డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి సాధించడం గొప్పతనమని తెలిపారు. అది జీర్ణించుకోలేక నాయకులు ఆర్‌డిఎస్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. టిడిపి అధికారంలోకి వస్తుందని, బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌డిఎస్‌ను పూర్తి చేస్తామని తెలిపారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు బీవీ జయ నాగేశ్వరరెడ్డి ఆర్‌డిఎస్‌కు రూ.వేల కోట్లు తీసుకొచ్చి పనులను ప్రారంభిస్తే వాటిని ముందుకు తీసుకు పోయేందుకు ప్రభుత్వానికి చేతకాలేదని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్, మంత్రులు, ఎమ్మెల్యేల తీరుకు నిరసనగా త్వరలోనే మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిరసనలు చేపడతామని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-ఆలూరు

పట్టణంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి టిడిపి నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జీ వీరభద్రగౌడ్ శనివారం రూ.1,01,116 ఆలయ కమిటీ అధ్యక్షులు వైకుంఠం మల్లికార్జున చౌదరికి అందజేశారు. మల్లికార్జున చౌదరి మాట్లాడుతూ... ఆలయ నిర్మాణానికి అడిగిన వెంటనే విరాళం అందజేసిన వీరభద్రగౌడ్‌కు, వారి కుటుంబానికి మంచి జరగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయనను శాలువా కప్పి సన్మానించారు.

కష్టపడి చదివితే ఏదైనా సాధ్యమే

- మెడిసిన్ సీటు సాధించిన విద్యార్థులకు సన్మానం
- రాఘవేంద్ర జూనియర్ కళాశాల కృషి హర్షణీయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కష్టపడి చదివితే అనుకున్నది సాధించవచ్చని ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బాలయ్య, చిన్నారి చిన్న పిల్లల ఆస్పత్రి వైద్యులు మోహన్ తెలిపారు. శనివారం రాఘవేంద్ర జూనియర్ కళాశాలలో చదివి మెడిసిన్ సీటు సాధించి ఎంబిబిఎస్‌లో చేరిన విద్యార్థులు అనిల్ కుమార్, సాయి శర్వాణిని స్థానిక కళాశాలలో సన్మానించారు. అనిల్ కుమార్ అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో, సాయి శర్వాణి సిద్ధిపేటలోని సురభి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కాలేజీలో ఎంబిబిఎస్‌లో సీటు సాధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనిల్ గ్రామీణ ప్రాంతం ఐరన్‌బండలో ఉంటూ కష్టపడి చదివి అనుకున్నది సాధించారని తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించే ప్రయత్నం చేస్తున్న రాఘవేంద్ర జూనియర్ కళాశాల కృషిని అభినందించారు. అనంతరం నందవరం మండలం వైసిపి నాయకులు శివప్ప గౌడ్, సిద్ధార్థ డిగ్రీ కళాశాల డైరెక్టర్ వేణుగోపాల్ ఆచారి మాట్లాడారు. విద్యార్థులు కలలను నిజం చేసుకోవాలంటే అనిల్ కుమార్, సాయి శర్వాణిని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి గురువులకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని శ్రీరాఘవేంద్ర జూనియర్ కళాశాల డైరెక్టర్, హంస వాయిస్ దిన పత్రిక మేనేజింగ్ డైరెక్టర్, సినీ నిర్మాత కె.దేవేంద్ర రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి తెలిపారు. కార్పొరేట్‌కు దీటుగా తక్కువ ఫీజులతో మంచి విద్యనందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అనంతరం కళాశాల సీనియర్ అధ్యాపకులు జువాలజీ అధ్యాపకులు రేష్మను సిబ్బంది సన్మానించారు. హంస వాయిస్ దిన పత్రిక మేనేజింగ్ డైరెక్టర్ జాలవాడి బాష పాల్గొన్నారు.



ఎంబిబిఎస్ సీటు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న సిబ్బంది

నూతన గృహం ప్రారంభం

- రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం


నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న సీతారామిరెడ్డి

మంత్రాలయం రామచంద్ర నగర్‌లో మీసేవ నిర్వాహకులు రాంపోగు బ్రదర్స్ రాజు కుమారులు నూతనంగా నిర్మించిన ఇంటిని వైసిపి రాష్ట్ర నాయకులు వై.సీతారామిరెడ్డి ప్రారంభించారు. రాంపోగు సోదరులు సాల్మన్ రాజు, సుందర్ రాజు కుమారులు రాహుల్, రోహిత్ ఆహ్వానం మేరకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు పూల మాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఎస్ఐ వేణు గోపాల్ రాజ్, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, ఉప సర్పంచి హోటల్ పరమేష్ పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

- సర్పంచి అరుణదేవి

ప్రజాశక్తి-ఆలూరు

విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సర్పంచి అరుణదేవి తెలిపారు. శనివారం కెజిబివి పాఠశాలను సందర్శించి హాస్టల్ వసతి, బోధన గురించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం పాఠశాలలో మినరల్ వాటర్‌ను పరిశీలించి, ప్రాంగణంలో కంపచెట్లు, మురుగు నీటిని జెసిబి సహాయంతో తొలగించి పంచాయతీ కార్మికుల చేత బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్య వచ్చినా పంచాయతీ తరపున అందుబాటులో ఉంటామన్నారు. ఎస్ఒ సునీత పాల్గొన్నారు.


మినరల్ వాటర్‌ను పరిశీలిస్తున్న సర్పంచి అరుణదేవి

కార్యకర్తల కుటుంబానికి అండగా ఉంటాం : టిడిపి


ప్రజాశక్తి - కౌతాళం

కార్యకర్తల కుటుంబానికి అండగా ఉంటామని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు, టిడిపి మంత్రాలయం సీనియర్ నాయకులు ఉల్లిగయ్య పేర్కొన్నారు. శనివారం కౌతాళంలో పాడేగల్ ఈరప్ప అనారోగ్యంతో మృతి చెందారు. మండల నాయకులు వేర్వేరుగా వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పాడేగల్ ఈరప్ప దీర్ఘకాలికంగా పార్టీలో కార్యకర్తగా పని చేశారని తెలిపారు. ఆయన సేవలు పార్టీకి తీరని లోటన్నారు. చెన్న బసప్ప రూ.5 వేలను మట్టి ఖర్చుల నిమిత్తం అందజేశారు.

ప్రతిభ హైస్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళంలోని ప్రతిభ హైస్కూల్‌లో కరస్పాండెంట్ సయ్యద్ దూద్‌బాషా ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం విద్యార్థులతో వేషధారణలు వేయించి క్రిస్మస్ శుభాకాంక్షలు ముందుగా అందజేశారు. సెక్రటరీ మైనుద్దీన్, ఉపాధ్యాయులు ఈరన్న, భీమేష్, విరుపాక్షి పాల్గొన్నారు.


వేడుకలను నిర్వహిస్తున్న సిబ్బంది

అథ్లెటిక్స్‌లో 'రావూస్'కు ఆరు పతకాలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంతర్ రాష్ట్ర కళాశాల అథ్లెటిక్స్ పోటీల్లో పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలకు ఆరు పతకాలు లభించాయి. ఈ పోటీలు రాయలసీమ యూనివర్సిటీలో జరిగాయి. ఇందులో రావూస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు రెండు గోల్డ్, ఒక వెండి, మూడు కాంస్య పతకాలు సాధించారు. థర్డ్ ఎంపిసిఎస్ విద్యార్థి దస్తగిరి 1500 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్, 800 మీటర్లలో కాంస్య పతకం సాధించారు. థర్డ్ బికాం విద్యార్థి మాళిని లాంగ్ జంప్‌లో గోల్డ్ మెడల్, సెకండ్ బిఎ విద్యార్థి వెంకటేష్ 1500 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం, సెకండ్ బిఎ విద్యార్థి పద్మావతి లాంగ్ జంప్‌లో కాంస్య పతకం, సెకండ్ ఎంపిసిఎస్ విద్యార్థి నందిని 400 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించారు. శనివారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి, సిఒఒ సుజనారెడ్డి మాట్లాడుతూ... అంతర్ రాష్ట్ర కళాశాల అథ్లెటిక్స్ పోటీల్లో రావూస్ డిగ్రీ కళాశాలకు ఆరు పతకాలు రావడం మంచి శుభ పరిణామమని తెలిపారు. తమ కళాశాలలో ఉన్నతమైన చదువుతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. రావూస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తుండడం గర్వించదగ్గ విషయమన్నారు. తమ విద్యార్థులు ఎదగడానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కళాశాల యాజమాన్యం పోత్సాహం వల్లే ఆరు పతకాలు సాధించామని విద్యార్థులు తెలిపారు. అధ్యాపకులు పుల్లయ్య, రాఘవేంద్ర, ధనుంజయ, గోవిందు పాల్గొన్నారు.


విద్యార్థులను సన్మానిస్తున్న యాజమాన్యం

వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా డాక్టర్ రవి కుమార్



ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని కొండ పేటలో ఉన్న పురాతన దేవాలయం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా డాక్టర్ రవికుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సభ్యులు తనపై నమ్మకంతో వెంకటేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. దేవస్థానం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో త్వరలో పాలకమండలి సభ్యులను ఎన్నుకోనున్నట్లు ఆయన తెలిపారు

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - బనగానపల్లె

చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కెజిఆర్ కళాశాల కరస్పాండెంట్ కంకర రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కెజిఆర్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రెషర్స్ డే సంబరాలు నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ టివి సదాశివమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుతం ఉన్న విద్యావిధానానికి అనుగుణంగా నడుచుకొని రాబోయే రోజుల్లో మంచి విజయాన్ని సాధించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని తెలిపారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులతో చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను ఎంపిడిఒ తనిఖీ

కొలిమిగుండ్ల : మండలంలోని కొలిమిగుండ్ల, కలవటాల గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాలను ఎంపీడీవో సుబ్బరాజు శనివారం తనిఖీ చేశారు. కొలిమిగుండ్ల అంగన్వాడి కేంద్రం-5, కల్వాటాల గ్రామ పంచాయతీలోని అంగన్వాడి కేంద్రాలలో కోడి గుడ్ల స్టాక్, ఖర్చు వివరాలను అంగన్వాడీ టీచర్లు త్రివేణి, అరుణలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్



ఈనెల 27 నుంచి జనవరి 7 వరకు కేరళ రాష్ట్రంలో జరగబోయే జాతీయ స్థాయి సీనియర్స్ పురుషుల (సంతోష్ ట్రోఫీ) ఫుట్ బాల్ పోటీలకు పాల్గొనబోయే ఆంధ్రప్రదేశ్ జట్టుకు జిల్లా క్రీడాకారులు వినయ్, సుభాని, నరేంద్ర, పథ్విలు ఎంపికైనట్లు జిల్లా ఫుట్ బాల్ సంఘం కార్యదర్శి లక్ష్మీ కాంత్ ప్రసాద్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ముప్ప రాజశేఖర్, ఫుట్బాల్ సీనియర్ క్రీడాకారులు కర్నూల్ స్టేడియంలో అభినందించారు.

వినియోగదారునికి హక్కులు, బాధ్యతలు ఉన్నాయి

- రామకృష్ణ డిగ్ర కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణా రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

ప్రతి వినియోగదారుడు వ్యాపారస్తుడికి చాలా ముఖ్యమైనవాడని, వినియోగదారుడికి హక్కులు, బాధ్యతలు ఉన్నాయని రామకష్ణ విద్యాసంస్థల చైర్మన్ జి.రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో 'భారతదేశంలో వినియోగదారుల రక్షణ-సమస్యలు-బాధ్యతలు' అంశంపై కామర్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఒక రోజు జాతీయ స్థాయిలో అవగాహన సదస్సును రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ జి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్‌బిఐ మేనేజర్ ఎస్.విద్యాసాగర ప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. 2019లో ఏర్పడిన నూతన వినియోగదారుల పరిరక్షణ చట్టం కింద వినియోగదారులు ఇంకా ఎక్కువ భద్రతను పొందవచ్చు. ఎవరికైనా ఫిర్యాదు చేస్తే వినియోగదారునికి ఖర్చు ఎక్కువ అవుతుందని భయపడాల్సిన అవసరం లేదని, నేటి సాంకేతిక పరిజ్ఞానంతో ఎక్కడి నుండి అయినా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సత్వరం శక్తివంతంగా న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ విషయం వినియోగదారులు గుర్తించాలన్నారు. మేనేజర్ విద్యాసాగర ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ 20 లక్షల రూపాయల నుండి కోటి రూపాయల వరకు, రాష్ట్రస్థాయిలో కోటి నుండి పది కోట్ల వరకు, జాతీయస్థాయిలో పది కోట్లకు పైగా వినియోగదారుడు ఫిర్యాదు చేసి నష్టపరిహారాన్ని కోరే అవకాశం ఉందని తెలిపారు. పిజి కళాశాల డైరెక్టర్ డాక్టర్ హేమంత్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్యలు మాట్లాడారు. అనంతరం విద్యాసాగర్ ప్రసాద్ రెడ్డిని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ సదస్సుకు కామర్స్ డిపార్ట్మెంట్ విభాగం అధిపతి డాక్టర్ పుల్లయ్య సెమినార్ కన్వీనర్‌గా, అనుసంధాన కర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల మేనేజర్ ప్రగతి రెడ్డి, మహేశ్వర గుప్తా, శ్రావణి కుమారి, రత్నారెడ్డి, సత్యనారాయణరెడ్డి మస్తానయ్య, హుస్సేన్ బాషా కరుణ,హారిక, డాక్టర్ బాలసుబ్రమణ్యం డాక్టర్ కుమార్, కామర్స్ విభాగం అధ్యాపక బృందం విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో పేపర్ ప్రజెంటేషన్ చేయబోతున్న ఇతర కళాశాలల అధ్యాపకులు రీసర్చ్ స్కాలర్స్ వారి పేపర్స్‌ను ముద్రించి సావనీర్‌గా ముఖ్య అతిథి చేతుల మీదుగా చైర్మన్ విడుదల చేశారు.



సావనీర్ విడుదల చేస్తున్న దృశ్యం

బజాజ్ పి-150 సిసి పల్సర్ వాహనం ఆవిష్కరణ



బజాజ్ షోరూంలో నూతన బైకును ప్రారంభిస్తున్న కాటసాని ఓబుల్



నందికొట్కూరులో...

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని బజాజ్ షోరూంలో 150సిసి పల్సర్ నూతన ద్విచక్ర వాహనాన్ని వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన ఫీచర్లతో పూర్తి సరికొత్తగా తీర్చిదిద్దబడిన బజాజ్ పల్సర్ పి150 వాహనం నూతనంగా మార్కెట్లోకి వచ్చిందని తెలిపారు. ఈ వాహనం అత్యంత చురుకైన విన్యాసాలు చేసే బైక్ అని, ఆధునిక స్ఫూర్తి డిజైన్‌తో శక్తివంతంగా పునరుద్ధించబడిన వాహనం పల్సర్ పి 150 అని చెప్పారు. 150 సిసి ఇంజన్‌తో సరికొత్త ప్లాట్ఫారంపై మూడో వాహనం ఇది అని తెలిపారు. కార్యక్రమంలో బనగానపల్లి బజాజ్ షోరూం బ్రాంచ్ మేనేజర్ షేక్ ఖాజా హుస్సేన్, షోరూం సిబ్బంది, కాటసాని ఓబుల్ రెడ్డి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలోని బజాజ్ షోరూమ్‌లో షోరూం అధినేత రంగస్వామి ఆధ్వర్యంలో బజాజ్ పల్సర్ పి-150 సిసి నూతన మోడల్ బైక్‌ను జవ్వాజి సుంకన్న గౌడ్ సేవాసమితి అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు పరిసర ప్రాంత యువకులు, వాహన ప్రేమికులు ఈ బైక్ కొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బజాజ్ ఫైనాన్స్ రామిరెడ్డి, జవ్వాజి సుంకన్న గౌడ్ సేవా సమితి సభ్యులు, షోరూమ్ సూపర్ వైజర్ శేఖర్, నరేష్, మల్లికార్జున, మధుసూదన్, గోకారి, సేవాసమితి సభ్యులు ఆరుద్ర స్వామి, ఆర్ట్ శ్రీను, మైనార్టీ నాయకులు అబూబక్కర్ తదితరులు పాల్గొన్నారు.

మినుములో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి : ఎఒ

రుద్రవరం : మినుము పంటలో ఆశించే బూడిద తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాధికారి బి.జ్యోతి తెలిపారు. శనివారం మండలంలోని పెద్ద కంబలూరు, రుద్రవరం గ్రామాల్లో రైతులు సాగు చేసిన మినుము పంటను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా బూడిద తెగులు నివారణకు రైతులు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు గురించి ఆమె వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- వార్డు, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం పని చేస్తుందని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. నూతనంగా అసోసియేషన్ ఏర్పాటైన సందర్భంగా ఆ సంఘం ప్రతినిధులు మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నిసాను, మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డిలను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను విన్నమించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డి.మగ్బుల్ హుస్సేన్, హెచ్.శరత్ కుమార్‌లు మాట్లాడుతూ గత నాలుగు రోజుల కిందట తమ అసోసియేషన్‌ను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుకున్నామని తెలిపారు. నంద్యాల యుఎల్‌బికి సంబంధించి అధ్యక్షులుగా డి.మక్బుల్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా పి.జగదీశ్వర్ రావు, కే. మధుసూదన్ రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా శరత్ కుమార్, మరో 30 మందిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ అసోసియేషన్ రాష్ట్రస్థాయిలో ఉద్యోగస్తుల సంక్షేమానికి అహర్నిశలు పాటుపడుతున్న కాకర్ల వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహింపబడుతుందని, గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు అనుబంధంగా వారు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె వెంకట్, స్టేట్ జాయింట్ సెక్రటరీ బి.రవి, జిల్లా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌ను కలిసిన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు

నిరాశ్రయ మహిళలకు చీరలు పంపిణీ



నంద్యాల అర్బన్

నైబర్స్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్‌ను బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన రాష్ట్ర అధ్యక్షులు వంకిరి రామచంద్రుడు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంకిరి రామచంద్రుడు మాట్లాడారు. అనంతరం నంద్యాల జిల్లాలో ఉన్న నిశాంతి భవనంలో నైబర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వితంతువులకు, వికలాంగ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.



క్రీడా కారులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేస్తున్న కాలేజీ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు

చదువుతోపాటు క్రీడలు చాలా అవసరం

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి- పత్తికొండ

విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు చాలా అవసరమని ప్రతిభ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, స్పందన సొసైటీ అధ్యక్షులు సురేంద్ర అన్నారు. శనివారం కర్నూలు జిల్లా, పత్తికొండ పట్టణంలోని జూనియర్ కళాశాలలో క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, స్పందన సొసైటీ అధ్యక్షులు సురేంద్రబాబు మాట్లాడారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు చాలా అవసరమని అన్నారు. క్రీడలు ఆడడం ద్వారా మానసికఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో కర్నూలు ఎన్‌వైకెఎస్ సహకారంతో పత్తికొండ యువ స్పందన సొసైటీ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అందువలన విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కబడ్డీలో అమ్మాయిలకు , వాలీబాల్‌లో గెలుపొందిన అబ్బాయిలకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్ రెడ్డి, స్పందన సొసైటీ ఉపాధ్యక్షుడు లక్ష్మన్న , సెక్రటరీనాగరాజు, సభ్యులు రాజశేఖర్, బాష, కళాశాల అధ్యాపకులు లాలుస్వామి, మౌనిషా, పిఇటి మక్తుమ్, విద్యార్థులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

రూ 20 లక్షల నిధులతో అభివద్ధి పనులు : కాటసాని

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ 26వ వార్డులో అభివద్ధి పనులకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి శనివారం భూమి పూజ చేశారు. వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మి కాంతారెడ్డి ఆధ్వర్యంలో 26 వార్డ్ 65 వ సచివాలయం, విఠల్‌నగర్ లో రూ.20 లక్షల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని కోరారు. స్టాండింగ్ కమిటీ మెంబర్ సాన శ్రీనివాసులు, కార్పొరేటర్లు ఇప్పల నారాయణరెడ్డి, సంగాల సుదర్శన్ రెడ్డి, నాగ లక్ష్మిరెడ్డి, ఎరుకల వెంకటేశ్వర్లు, బాల చంద్రారెడ్డి, కల్లూరు మండల జడ్‌పిటిసి ఆల ప్రభాకర్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో ప్రెసిడెంట్ శివ శంకర్ రెడ్డి, నాయకులు పెద్దపాడు శ్రీధర్ రెడ్డి, పెద్ద టేకూరు హనుమంతు రెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, పెద్దన్న, బ్రహ్మానందరెడ్డి, దేవదాసు, నాగ భూషణం, ఖాజా, నాగేశ్వరరావు, రవి, మహానంది రెడ్డి, సుధాకర్ రెడ్డి,నాగరాజు, రామచంద్రుడు, రఫీ, ఆయూబ్, శేఖర్, సాయి, చైతన్య అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కోడుమూరు వాసులు

ప్రజాశక్తి-కోడుమూరు

కోడుమూరు పట్టణంలోని ఒక నిరుపేద మహిళ వయస్సు (35) భర్త వదిలేశాడు. ఒక వయసుకు వచ్చిన కుతురు, కష్టాన్ని జీవితంగా అనుకుని జీవనం సాగిస్తున్న తరుణంలో విధి వింత రాతలో ఆమె దగ్ధం అయింది. వివరాల్లోకి వెళితే ...కోడుమూరు కొండపేటలో నివసిస్తున్న చాకలి ఈరమ్మ కులవత్తి చేసుకుంటూ భర్త వదిలేసిన తన కూతురు తులసి ఇద్దరు అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఈరమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని శుక్రవారం పరిస్థితి విషమించడంతో వీధిలో ఇరుగు పొరుగు ముస్లిం దంపతులు మరి కొందరు కర్నూలు ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. అప్పటికే ఆమె తుది శ్వాస విడువడంతో చేసేదేమీ లేఖ దహన సంస్కారాలు చేసే స్థోమత అండ దండలు లేకపోవడంతో, విషయం తెలుసుకొని కొందరు పెద్దలు మంచి మనస్సుతో ముందుకు వచ్చి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర దేవా యలం కమిటీ చైర్మెన్ ఎద్దుల మహేశ్వర రెడ్డి , రమేష్ నాయుడు, అంధ్రయ్య, వెంకట స్వామి గుజిరి, విరేష్, పత్రిక విలేకరి గంగాధర్ నాయుడు, బుడగ జంగాల మద్దిలేటి, వై.సుంకన్న,చంద్ర,కొండపేట ప్రజలు రూ.35000 ఆర్థిక సాయం చేసి దహన సంస్కారాలు పూర్తి చేయించారు. తనను చూసుకుని తల్లి ఇక లేదని తెలిసిన తులసి శోక సంద్రంలో మునిగింది. ఆమె మరణంతో కొండపేట కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తల్లితండ్రిలేనితులసి జీవితం ప్రశ్నార్థకంగా మారింది. కొండపేట ప్రజలు , వారి బంధువులు పాల్గొన్నారు.

నేడు సినీకామెడీ స్కిట్స్

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్ : సినీ, టీవి, జబర్దస్త్ హైద్రాబాద్ కళాకారులతో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు సినీ కామెడీ స్కిట్స్ ఏర్పాటుచేసినట్లు లలితకళాసమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో సినీ హీరో సంపూర్ణేష్ బాబు, కితకితలు హీరోయిన్ గీతాసింగ్, జబర్దస్త్ కళాకారులు వినోద్, చిట్టిబాబు, టివి నటి రజని, శ్రీకళ తమ స్కిట్స్‌ను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నారాయణలో రైతు దినోత్సవ వేడుకలు

కర్నూల్ కలెక్టరేట్: నగరంలోని స్థానిక మాధవినగర్‌లో ఉన్న నారాయణ పాఠశాలలో రైతు దినోత్సవం వేడుకలు శనివారం నిర్వహించారు. చిన్నారులు గార్గేయాపురం, తడకనపల్లి గ్రామాల వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి పంటలు ఏవిధంగా పండిస్తారు, అందుకు అవసరమైన అంశాలపై రైతులతో మాట్లాడి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు రైతు కూలీల వేషధారణ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్ఐ దుర్గాలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ అమీనా, ముంతాజ్ బేగం పాల్గొన్నారు.

ఉచిత బస్సు పాసు డోర్ డెలివరీ తేదీ పొడిగింపు

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

విద్యార్థుల బస్ పాసులు రెన్యువల్ డోర్ డెలివరీ చేయు విధానాన్ని 2023 ఏప్రిల్ 30 వరకు పొడిగించినట్లు ఆర్ఎం. టివి.రామం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు పాసుల జారీలో డిజిటల్ చెల్లింపులను , రెన్యువల్ చేసిన బస్సు పాసులను సంబంధిత స్కూళ్ళకు, కాలేజీలకు ఉచితంగా అందజేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని ఎంపిక చేసిన 16 పట్టణాలలో కర్నూలు ఉందని పేర్కొన్నారు. 2022 మార్చి ఒకటి నుంచి నుండి డిసెంబర్ 31వరకు ప్రవేశపెట్టిందన్నారు. ఈ డిజిటల్ చెల్లింపులను , రెన్యువల్ చేసిన బస్సు పాసులను ఉచితంగా డోర్ డెలివరి (స్కూళ్ళు/కాలేజిలు) చేయు విధానాన్ని 2023 ఏప్రిల్ వరకు పొడిగించడాన్ని సంతోషిస్తున్నా మన్నారు.ఈ విధానం ద్వారా విద్యార్థులు బస్సు పాసు రెన్యువల్ కొరకు బస్సు పాసు కౌంటర్లకు వచ్చే అవసరం లేకుండా, ఆన్ లైన్ ద్వారా డిజిటల్ చెల్లింపులు చేసి తమ విలువైన సమయాన్ని ఆదా చేసు కొన వచ్చని పేర్కొన్నారు. డోర్ డెలివరి సౌకర్యం వినియోగానికి విద్యా ర్థులు అదనంగా ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మరిన్ని వివరాలకు విద్యార్థులు http:online.apsrtcpass.in వెబ్ సైట్ ను సందర్శించి చూసుకోవచ్చన్నారు.

ఎబివిపి మహాసభకు కేంద్ర మంత్రి హాజరు

ప్రజాశక్తి -కర్నూలు అగ్రికల్చర్



రెండో రోజు మహాసభలో టిజివి తదితరులు

కర్నూలు నగరంలోని ఏ.క్యాంప్ మొంటిస్సోరి పాఠశాలలో జరుగుతున్న ఎబివిపి 41వ రాష్ట్ర మహాసభలకు కేంద్ర విదేశీ వ్యవహారాలు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి వెల్లంపల్లి మురళీధరన్ హాజరయ్యారు. 1000 మంది ప్రతినిధులతో 2వ రోజు కార్యక్రమాలు ప్రారంభమైంది. మంత్రి గతంలో ఎబివిపి లో పనిచేసిన రోజులు, గుర్తు చేసుకుంటూ బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులకు వ్యతిరేకంగా పోరాడినట్లు చెప్పారు. ఎబివిపిలో పనిచేసి నేర్చుకున్న క్వాలిటీ కమిట్‌మెంట్ ద్వారానే ఈరోజు కేంద్ర ప్రభుత్వంలో ఈ స్థానానికి వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మురళీధర్ రావు , రాష్ట్ర కార్యదర్శి సాలూరి యాజేంద్ర గారు, స్వాగత సమితి అధ్యక్షులు టిజి. వెంకటేష్ , ఆలిండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలకృష్ణ , విభాగ కన్వీనర్ మహేష్ , విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటల కు ఏ క్యాంప్ మంటేస్సోరి స్కూలునుండి పాతబస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. బహిరంగ సభ లో పలువురు వక్తలు మాట్లాడారు. ఎబివిపి జాతీయ కార్యదర్శి నాగోతు హరికృష్ణ, రేష్మ, యెగేంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణరెడ్డికి స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ మద్దతు

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

పశ్చిమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచిన రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంఘం పూర్వ అధ్యక్షుడు జివి. నారాయణరెడ్డికి స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు ప్రధాన ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ వారు తనకు సంపూర్ణ మద్దతు ప్రకటించినందుకు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరోత్తమరెడ్డి, సుబ్బారావు , వర్కింగ్ ప్రెసిడెంట్ శౌరి రాయలు కృతజ్ఞతలు తెలిపారు.

మానవత్వానికి స్వాగతం

జన్మించింది నేడు మంచితనం రూపుదిద్దుకున్నది మానవత్వం రూపాంతరం చెందింది
దైవత్వం బృహత్తర తార వెదజల్లింది కాంతిపుంజం
శ్రావ్య సంగీతమైనది దేవదూతల గానం
చలిలో నీ జననం కలిగించింది హృధిలో వెచ్చని చైతన్యం
పాడింది నిరాశనిస్పృహలకు చరమగీతం
చరిత్రలో జరిగిన మహాద్భుతం మానవ మేధస్సు కందని అపురూప దృశ్యం
భగవంతుడు ఈ భూమి పైకి పశువుల పాకలో పేద తల్లి కడుపున పుట్టడం
త్రిత్వం నిత్యత్వం అనే మర్మం తండ్రి కుమారా పరిశుద్ధాత్మ
అతి సామాన్యుడిగా నీవు పుట్టడం నభూతో నా భవిష్యతి ఇది అపూర్వం
రోగుల కోసం దీనుల కోసం
ఆపన్న హస్తమై అన్నార్తుల కోసం పేద గొప్ప తారతమ్యాన్ని రూపుమాపడం కోసం
జడ జీవనంలో ప్రేమ పంచడం కోసం
సాటి మానవులను ప్రేమించమని సన్మార్గం వైపు మళ్ళించి
క్షమా దయ అనే ధర్మాన్ని ఉపదేశించి
కష్టాలను కడగండ్లను తీర్చి
త్రికాలల్లోనూ మాతో ఉంటానని నీవు మాకు ఇచ్చిన
వాగ్దానం గొప్పవరం
హృదయపూర్వక హృదయ ద్వారాలను తెరిచి ఏసుప్రభు
నీకు ఇదే పలుకుతున్నాం శుభ స్వాగతం



డాక్టర్ బివి.స్వరూప్‌సిన్హా
మాంటిస్సోరీ స్కూల్
కర్నూలు -9866137204



కేక్ కట్ చేస్తున్న బలరాం , తదితరులు

ప్రజా పరిరక్షణ సమితిలో ముందస్తు క్రిస్మస్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రజా పరిరక్షణ సమితి కార్యాలయంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రజా పరిరక్షణసమితి అధ్యక్షుడు కె.బలరాం తోపాటు పద్మానంద యోగిలతో కలిసి కేక్ కట్ చేసి సమితి నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కుల మత వర్గ భేదాలు లేకుండా, ప్రజలు ఈ వేడుకలు జరుపుకోవాలని వారు కోరారు. క్రీస్తు ఏ మార్గం అయితే నడిచాడో ఆ మార్గంలో నడిచేందుకు పూలుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు డేవిడ్, శ్రీరాములు, కోటయ్య, ఎం.రవిప్రసాద్, రవికుమార్, కొండయ్య, బ్రహ్మం, పురుషోత్తం, చంద్రకుమార్, మల్లికార్జున, రాహుల్, శివమణి, రాంచరన్, తదితరులు పాల్గొన్నారు. సాయి కృష్ణ డిగ్రీ కళాశాలలో చనిపోయిన రాజకుమార్ మృతిపై విచారణ చేపట్టాలి.

రాష్ట్ర వాలీ బాల్‌లో కర్నూలు ప్రథమం

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

జగనన్న క్రీడా సంబరాలను పురస్కరించుకొని ఈ నెల 21న కృష్ణా జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు మొదటి స్థానంలో నిలిచి మూడు లక్షల నగదు పురస్కారాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం కర్నూలు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు కలెక్టరేట్లోని తన చాంబర్లో క్రీడాకారులను జిల్లా క్రీడా శాఖ సిఇఒ రమణతో కలిసి అభినందించారు. శిక్షకులు రవికుమార్ రాజేష్ లను ప్రత్యేకంగా అభినందించారు.

సాయికష్ణ కాలేజీ గుర్తింపును రద్దు చేయాలి: పిడిఎస్‌యు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సాయికృష్ణ డిగ్రీ కళాశాలలో చనిపోయిన రాజ్ కుమార్ మృతిపై విచారణ చేపట్టాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు రఫీ ,కార్యదర్శి నాగరాజు ఒక సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతి చెందిన విద్యార్థి రాజ్‌కుమార్‌ను వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ, కర్నూలు నగరంలోనీ డాక్టర్స్ కాలనీలో ఉన్న సాయికృష్ణా డిగ్రీ కళాశాలలో బిజెడ్‌సి మూడో సంవత్సరం చదువుతున్న రాజకుమార్ గురువారం ఉదయం 8:30 ప్రాంతంలో తన వాష్ రూమ్‌లో మృతి చెందాడని, ఆ మతి పై కళాశాల యాజమాన్యం ఎవరు కూడా సరైన రీతులో స్పందించడం లేదన్నారు. ఆ అబ్బాయి ఎలా చనిపోయాడు అని అడిగితే, మాకు తెలియదని అంటున్నారు తప్ప, పూర్తిస్థాయిలో ఎవరు కూడా చెప్పడం లేదనీ, రాజ్ కుమార్ తల్లిదండ్రులు మాత్రం తమ అబ్బాయిని కోల్పోయామని రోధిస్తూ కళాశాల యాజమాన్యమే కారణమంటున్నారని అన్నారు. అబ్బాయి శరీరం ఎడమవైపు చాతి భాగంలో దెబ్బ తాకినట్లు ఉండడంతో మరింత అనుమానానికి దారి తీసే విధంగా ఉందన్నారు. పోలీస్ అధికారులు తక్షణమే స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేసి,వి చారణలో మరణానికి కారకులు ఎవరైనా వారిని తక్షణమే అరెస్టు చేసి, న్యాయ పరమైన శిక్షలు విధించే విధంగా చర్యలు తీసుకోవాలనీ, అదేవిధంగా రాజ్‌కుమార్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు.





సిఐటియు జిల్లా 2వ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ చేపట్టిన నాయకులు

మట్టితో మరమ్మతులు మమ..

- బ్రిడ్జికి మధ్యలో రంధ్రం.. మట్టితో కప్పేశారు..
- చేతులు దులుకున్న అధికారులు - మట్టి చాటున పొంచి ఉన్న ప్రమాదం


సింగనపల్లి ఓబులాపురం గ్రామాల మధ్య కూలిన బ్రిడ్జి (ఫైల్)


రంధ్రాన్ని మట్టితో కప్పి వేసిన దృశ్యం

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలంలోని సింగనపల్లి నుండి ఓబులాపురం మీదుగా అవుకు జలాశయం వరకు చేపట్టిన రింగురోడ్డు మధ్యలో ఉన్న బ్రిడ్జిపై పెద్ద రంధ్రం ఏర్పడింది. అయితే ఈ రంధ్రానికి పటిష్టంగా మరమ్మతులు చేపటాల్సిన అధికారులు మట్టిని కప్పేసి చేతులు దులుపుకున్నారు. మట్టి చాటున పొంచి ప్రమాదాన్ని గమనించకుండా వాహనదారులు వెళ్తే ప్రమాదాలకు గురి కావాల్సిందేనని స్థానికులు, ప్రయాణికులు పేర్కొంటున్నారు.

అవుకు మండలంలోని సింగనపల్లి నుండి ఓబులాపురం మీదుగా రింగురోడ్డును అవుకు జలాశయం వరకు 2021లో నూతనంగా రూ.3.19 కోట్లతో నిర్మించారు. నిర్మాణం చేపట్టిన ఏడాదిన్నరకే బ్రిడ్జి మధ్యలో పెద్ద రంధ్రం ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎపి గ్రామీణ రహదారుల ప్రాజెక్టు కింద 6 మోరీలు, 1 కాజ్‌వేతో 5.20 కిలోమీటర్ల మేర రింగ్ రోడ్డును ఏర్పాటు చేసి 2021లో ప్రారంభించారు. ఈ రోడ్డు వలన సింగనపల్లి నుండి అవుకు రిజర్వాయర్ వరకు రాకపోకలు ప్రతిరోజు కొనసాగిస్తున్నారు. ఈ రహదారి వలన ప్రయాణికులకు, వాహన చోదకులకు చాలా ఉపయోగకరంగా ఉంది. అయితే నాసిరకం నిర్మాణాల వలన మోరీలను చేపట్టడంతో కేవలం ఒకటిన్నర సంవత్సరం కాలంలోనే బ్రిడ్జికి పెద్ద రంధ్రం ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రంధ్రాలు పడిన విషయాన్ని గమనించిన అధికారులు మట్టితో కప్పివేసి చేతులు దులుపుకున్నారు. ఈ బ్రిడ్జిపై రాకపోకలు కొనసాగిస్తే ప్రమాదాన్ని గురి కావాల్సిందేనని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి కింద నీరు ప్రవహిస్తునడంతో మట్టి కొట్టుకుపోయి మళ్లీ పెద్ద రంధ్రం ఏర్పడే ప్రమాదం పొంచి ఉందని, దీనిపై రాకపోకలను కొనసాగిస్తే ప్రమాదాన్ని గురికావాల్సిందేనని స్థానికులు చెబుతున్నారు. ఈ రోడ్డు 2025 వరకు మెయింటినెన్స్ చేసే విధంగా సుమారు రూ. 10 లక్షలు కేటాయించినట్లు అక్కడ ఏర్పాటు చేసిన సూచిక బోర్డులో స్పష్టంగా పేర్కొన్నారు. ఏదేమైనప్పటికీ రూ. 3 కోట్ల మేర నిధులతో ఏర్పాటు చేసిన రోడ్లు, ఒక బ్రిడ్జి మధ్యలో పెద్ద రంధ్రం ఏర్పడి ప్రయాణాలకు ఆటంకంగా మారడం, నిర్మాణ సయంలో అధికారుల పర్యవేక్షణ, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అవినీతి పనితనానికి అద్దం పడుతోంది.

సిఐటియు జిల్లా మహాసభను విజయవంతం చేయండి

- నంద్యాల పట్టణంలో నాయకుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే సిఐటియు జిల్లా 2వ మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట.మద్దులు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, కె.మహమ్మద్ గౌస్, కోశాధికారి వెంకట లింగంలు కోరారు. శనివారం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ఎన్జీవోస్ కాలనీలోని కార్యాలయం నుండి ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా సాయిబాబా నగర్, కరెంట్ ఆఫీస్, పద్మావతి నగర్, శ్రీనివాస్ సెంటర్ మీదుగా గాంధీ చౌక్ వరకు నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఏర్పడిన తర్వాత పట్టణంలో ఈ నెల 27, 28వ తేదీలలో సిఐటియు జిల్లా రెండవ మహాసభ జరుగుతున్నాయన్నారు. 27వ తేదీ ఉదయం సిఐటియు జిల్లా కార్యాలయం నుండి టెక్కె మార్కెట్ యార్డ్ వరకు జరిగే ర్యాలీ కార్మికులు, ఉద్యోగులు, ప్రజలతో వేలాది మందితో జరుపుతున్నామని తెలిపారు. అనంతరం టెక్కె మార్కెట్ యార్డులో జరిగే బహిరంగ సభలో ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి పాల్గొని ఉపన్యసిస్తారని తెలిపారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, గత మూడు సంవత్సరాల కాలంలో జరిగిన పోరాటాలను సమీక్షిస్తూనే, రాబోయే మూడు సంవత్సరాల కాలంలో జరపాల్సిన పోరాటాలకు దిశా నిర్దేశం జరగనుందని తెలిపారు. కార్మికులకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీల నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైన ప్రభుత్వాలపై పెద్ద ఎత్తున తీవ్రమైన వ్యతిరేకత ఉందని, ఈ క్రమంలో జరిగే ఈ జిల్లా మహాసభ ప్రాధాన్యత సంచరించుకుందని, కావున ఈ జిల్లా మహాసభలో కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, జైలాన్, లాలా హుసేని, కిట్టయ్య, వెంకట్రావుతోపాటు వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

- జిల్లా పౌరసరఫరాల అధికారి ఎన్ఎన్.ఆచార్యులు
- జాతీయ వినియోగదారుల దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల

ప్రతి వినియోగదారుడూ తనకు గల హక్కులపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని జిల్లా పౌరసరఫరాల అధికారి యన్.యన్.ఆచార్యులు పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శనివారం నేషనల్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థుల నుద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రజలు డబ్బు చెల్లించి కొనుగోలు చేసే ఏ వస్తువులో అయినా నాణ్యత లోపించినపుడు లేదా మోసపోయామని గుర్తించినపుడు సరైన ఆధారాలతో వినియోగదారుల కమిషన్లలో ఫిర్యాదు చేసి, తగిన పరిహారాన్ని పొందవచ్చని తెలిపారు. వినియోగదారులు కొనే ప్రతి వస్తువుకు ఖచ్చితంగా రశీదును తీసుకోవడం మరచిపోకూదదని అన్నారు. ఇంకా ప్రతి వినియోగదారుడు తమకు గల హక్కుల గురించి అవగాహన ఏర్పరచుకొని, ఎటువంటి మోసాలకు లోను కాకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరావు, వినియోగదారుల పరిరక్షణ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు డా.అమీర్ భాష, ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీనివాసులు, కళాశాల అధ్యాపకులు సాయికుమార్, తిరుపాలు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ర్యాలీ చేపడుతున్న దృశ్యం

రాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - శ్రీశైలం

ఈ నెల 26న శ్రీశైలంలో భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం శ్రీశైలం దేవస్థానంలోని సమావేశ మందిరంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన కార్యక్రమం ఏర్పాట్లపై జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతిలతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాష్ట్రపతి శ్రీశైలం పుణ్యక్షేత్ర పర్యటనలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశానికి గైర్హాజరైన సివిల్ సర్జన్, ఎపిఎస్‌సిడిసిఎల్ ఎస్ఇ, ఆర్‌టిసి ఇఇలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిఆర్ఒను ఆదేశించారు. పర్యటనకు ఒక్క రోజే సమయం ఉన్నందున అధికారులకు కేటాయించిన విధులు బాధ్యతాయుతంగా నిర్వర్తించి విజయవంతం చేయాలన్నారు. భారత రాష్ట్రపతి పాల్గొనే సున్నిపెంట హెలిప్యాడ్, శ్రీశైల ప్రధానాలయం, టూరిజం ఫెసిలిటేషన్ సెంటర్, శివాజీ స్ఫూర్తి కేంద్ర ప్రదేశాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి వేర్వేరు రకాలతో, సంబంధిత ఉద్యోగి ఐడెంటిటీ కార్డుతో సరిపోల్చుకొని గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిఆర్ఒను ఆదేశించారు. రాష్ట్రపతి విధుల్లో పాల్గొనే అధికారులకు ప్రాధాన్యత క్రమంలో కోవిడ్ పరీక్షలు నిర్వహించాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. ఆదివారం ఉదయం నిర్వహించే ట్రయల్ రన్‌లో అధికారులకు కేటాయించిన ప్రదేశాల్లో వుండాలని సూచించారు. రాష్ట్రపతికి ఇచ్చే ఆహార పదార్థాలు, భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి తీర్థ ప్రసాద వితరణ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ నుండి రాష్ట్రపతి పాల్గొనే ప్రదేశాల్లో ముమ్మర పారిశుధ్య చర్యలు చేపట్టేందుకు అధిక సంఖ్యలో కార్మికులు, సూపర్వైజర్లను నియమించాలని డిపిఒ, ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే నాలుగు ప్రదేశాల్లో తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. భ్రమరాంబ అతిథి గృహంలో రాష్ట్రపతి విడిది ఏర్పాట్లలో ఎలాంటి చిన్న పొరపాట్లకు తావివ్వకుండా అన్ని విధాలా ముందస్తు చర్యలు తీసుకోవాలని దేవస్థాన ఇఒ లవన్నను ఆదేశించారు. శ్రీశైల ప్రధాన గోపురమైన శ్రీకృష్ణదేవరాయ గోపురం వద్ద ఆలయ సాంప్రదాయాలతో భారత రాష్ట్రపతికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఇఒకు సూచించారు. రాష్ట్రపతి పర్యటించే రహదారిలో గుంతలు లేకుండా చూడటంతో పాటు సైడ్‌లో వైట్ పెయింటింగ్‌తో మార్కింగ్ ఇవ్వాలన్నారు. కాన్వాయ్‌లో చెంచు విద్యార్థుల సుస్వాగత నృత్యం, చెంచులతో ముఖాముఖి కార్యక్రమాల నిర్ణీత తక్కువ సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్, ఎస్పీలు ట్రయిల్‌రన్ నిర్వహించి అధికారులకు, పోలీసులకు పలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవోలు శ్రీనివాసులు, వెంకటరెడ్డి, ఎం.దాసు, శ్రీశైల దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ రెడ్డి వారి చక్రపాణిరెడ్డి, ఇంటెలిజెన్స్ రిటైర్డ్ ఓఎస్డి శశిధర్ రెడ్డి, డిఆర్ఒ పుల్లయ్య, దేవస్థాన ఇఒ లవన్న, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి - ప్యాపిలి

మండల పరిధిలోని పిఆర్.పల్లెలో విద్యుత్ ఘాతంతో రైతు మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. జలదుర్గం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పిఆర్.పల్లి గ్రామానికి చెందిన రైతు వెంకట్ రెడ్డి (37) తన పొలంలో మోటారును మరమ్మతులు చేసి మళ్లీ మోటర్‌ను బోర్‌లో దింపి స్టార్టర్ బటన్ నొక్కగానే ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైతుకు భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని జలదుర్గం పోలీసులు తెలిపారు.

26న పోలీసు స్పందన తాత్కాలిక రద్దు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ నెల 26వ తేదీ సోమవారం శ్రీశైలంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా నంద్యాల జిల్లా అధికారులు బందోబస్తు డ్యూటీలో ఉన్నందున నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జరుగు పోలీసు స్పందన కార్యక్రమమును తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుండి వ్యయ, ప్రయాసలతో వచ్చే వారు ఈ విషయాన్ని గమనించి రావొద్దని విజ్ఞప్తి చేశారు.

అహోబిలంలో జిల్లా ప్రిన్సిపల్ జడ్జి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో కర్నూలు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి శ్రీనివాస్ స్వామి అమ్మవార్లని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున ధనుర్మాస పూజల్లో పాల్గొన్నారు. దిగువ, ఎగువ అహోబిలంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, మఠం మేనేజర్ శ్రీనివాసన్ ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి, శ్రీవారి శేష వస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో డిఎస్పి సుధాకర్ రెడ్డి, రూరల్ ఎస్ఐ నరసింహులు పాల్గొన్నారు.

2,360 మంది పెన్షన్‌దారులకు నోటీసులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణం, అర్బన్‌లో 2,360 మంది పెన్షన్‌దారులకు నోటీసులు పంపినట్లు మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్ర రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నంద్యాల అర్బన్ ఏరియాలో 18,860 మంది పెన్షన్‌దారులు ఉన్నారని చెప్పారు. అందులో 2,360 మందికి పలు రకాల కారణాలతో నోటీసులు అందజేశామన్నారు. నోటీసులు అందుకున్న వారు పెన్షన్‌కు అర్హులమేనని, అందుకు తగ్గ వివరాలు అందజేయాలని పేర్కొన్నారు. నోటీసులు ఇచ్చిన వారిలో ఎక్కువ ఆదాయం, ఫోర్ వీలర్స్ ఉన్నట్లు, ప్రాపర్టీ అధికంగా ఉన్నట్లు లబ్ధిదారుల ఆధార్ నెంబర్ లింక్‌యి ఉన్నట్లు ఆన్లైన్‌లో చూపిస్తున్నందువల్ల వారికి నోటీసులు ఇచ్చామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి-డోన్

డోన్ ఎస్‌కెపి స్కూల్ 1988 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సమావేశం స్థానిక మాలిక్ బాబా గుడి ఆవరణలో జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా భవిష్యత్తులో జరపబోవు సమ్మేళనం గురించి చర్చించినారు. ఈ సమావేశంలో మునిసిపల్ కో-ఆప్షన్ మెంబర్ రఫీ, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామచంద్రుడు, నాగిరెడ్డి, డెంటల్ డాక్టర్ రాజా జగన్, జాహీర్, పోస్ట్ మేనేజర్ మనోజ్, ఆదాం, ప్రవీణ్ రాజ్, మురళీ, మందుగుండు రమణ, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి పాతజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు అనుభవాలను పంచుకున్నారు.


మాట్లాడుతున్న కో ఆప్షన్ మెంబర్ వైఎస్ఆర్. రఫీ

టిటిడి ఇఒకు మంత్రి అంబటి రాంబాబు పరామర్శ

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ధర్మారెడ్డి కుమారుడు ఏవి చంద్రమౌళి రెడ్డి హఠాన్మరణం చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంత్రి అంబటి రాంబాబు శనివారం పారుమంచాల గ్రామానికి చేరుకుని ధర్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి రెడ్డి అకాల మరణంపై మంత్రి అంబటి ప్రగాఢ సానుభూతి తెలిపారు. చంద్రమౌళి రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే పలువురు రాజకీయ ప్రముఖులు ధర్మారెడ్డిని పరామర్శించారు. పరామర్శించిన వారిలో విజయవాడ ఇన్‌కంట్యాక్స్ ప్రిన్సిపాల్ కమిషనర్ అనిల్ కుమార్, ఆర్‌టిఏ కమిషనర్ రమణ కుమార్, రాయలసీమ డిఐజి సెంథిల్ కుమార్, మాజీ ఎంపి బాపిరాజు, రిటైర్డ్ కలెక్టర్ రవి చోప్రా, హైదరాబాద్ ఫీనిక్స్ సంస్థ అధినేత సురేష్, బెంగుళూరు ఎన్‌సిసి కమిషనర్ రంగరాజు, తెలంగాణా ఎంపి, రాజ్యసభ సభ్యులు దామోదర్ రావు, తెలంగాణా టిటిడి డైరెక్టర్ భాస్కర్ రావ్, కర్నూలు జలమండలి ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, సిఈ కబీర్ బాషా, ఈఈ తిరుమలేశ్వర రెడ్డి, డిఈ ప్రసాద్‌లు ఉన్నారు.


ధర్మారెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సరికొత్త నూతన పల్సర్ పి-150సిసి బైక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

నంద్యాల నంది బజాజ్ షోరూంలో సరికొత్తగా రూపుదిద్దుకున్న నూతన పల్సర్ పి-150 సిసి బైక్‌ను శనివారం ఎస్‌బిఎల్ ఎస్ఎంఇ బ్రాంచి చీఫ్ మేనేజర్ సురేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నంది బజాజ్ ఎండి చింత సుదర్శన్ రెడ్డి మాట్లాడుతు ప్రపంచంలో ఎక్కువ మంది అభిమానించే, అత్యంత విలువైన ద్విచక్ర వాహనమని, దీనిని మెరుగైన ఫీచర్లతో పూర్తి సరికొత్తగా బజాజ్ కంపెనీవారు భారత దేశంలో విడుదల చేశారని తెలిపారు. షోరూం జిఎం కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ వాహనం అత్యంత చురుకైన విన్యాసాలు చేయగల బైక్ అన్నారు. ఆధునిక స్పోర్టీ డిజైన్లో రావడంతో పాటు 150 సిసి ఇంజన్ శక్తిని కలిగి వుండి రైడర్లకు చూడగానే ఆకట్టుకునే విధంగా, గరిష్టంగా 8500 పిపిఎం వద్ద 14.5పిక్ శక్తిని ఇస్తుందని చెప్పారు. నూతన మోనో షాక్ రియర్ సస్పెన్షన్ను కలిగి వుందని, ఎన్‌విహెచ్ నిర్వహణ కోసం టెంపరను జోడించినట్లు తెలిపారు. ఇది నగర వీధులలో అతి సులువుగా తిరగగలదని, బై ఫంక్షనల్ ఎల్‌ఈడి, ఎల్‌ఈడి ప్రాజెక్టర్ హెడ్ కాంప్ కలిగివుండి, యుఎస్బి మొబైల్ ఛార్జింగ్ సిస్టం, గేర్ పొజిషన్, ఇండికేటర్, అస్యూర్డ్ ఛార్జింజ్, బ్రేకింగ్ సిస్టం, ఐదు కలర్లు, సింగల్ సీటు (సంగల్ డిస్క్), మంచి స్లిప్ట్ సీటు, న్యూస్లిప్ట్ వెర్షన్ వంటి ఆధునీక ఫీచర్లు కలిగి ఉన్నాయని చెప్పారు. ఎచాని బ్లాక్ బ్లు, ఎబోని బ్లాక్ వైట్ కలర్లలో లభ్యమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో నంది బజాజ్ మేనేజర్ నాగరాజు స్టాఫ్, కస్టమర్లు పాల్గొన్నారు.



నూతన పల్సర్ బైక్‌ను ఆవిష్కరిస్తున్న మేనేజర్ సురేష్

26న ధర్నాను విజయవంతం చేయండి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె


ఉద్యోగ ఉపాధ్యాయుల అపరిష్కృత డిమాండ్ల సాధనకు ఈ నెల 26వ తేదీ సోమవారం అన్ని జిల్లా కలెక్టర్ల కార్యాలయల ఎదురుగా జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవస్వామి కోరారు. శనివారం పట్టణంలోని ఏపిటిఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు నుండి ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల సాధనలో పురోగతి లేనందున ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయలను వెంటనే విడుదల చేయాలన్నారు. సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల సిపిఎస్ అమౌంటు ఎన్ఎస్డిఎల్‌లో జమ చేయాలన్నారు. మెడికల్ బిల్లు బకాయిలను విడుదల చేయాలన్నారు.

జనవరి 2022 నుంచి రావాల్సిన రెండు విడతల డిఎలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, పిఎఫ్, ఏపీజిఎల్ఐ బకాయిలను విడుదల చేయాలని, 117, 128, 84 జీవోలను వెంటనే రద్దు చేయాలని, ఉపాధ్యాయ బదిలీల్లో అసంబద్ధమైనవి తొలగించాలని, సంపాదిత సెలవుల్లో బకాయాలను విడుదల చేయాలని, పండిట్, పీఈటిల సమస్యలను తొలగించాలని డిమాండ్ చేశారు.

తొలగించిన పెన్షన్లను పునరుద్ధరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూరు

అర్బన్ ప్రాపర్టీ, వివిధ రకాల నిబంధనల పేరుతో తొలగించిన పెన్షన్స్‌ను వెంటనే పునరుద్ధరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్, పట్టణ నాయకులు ఏ సురేంద్ర, డి రామ్ నాయక్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో జరిగిన కొన్ని తప్పులను సాకు చూపుతూ ఒకరిపేరు మీద ఒక మీటర్ ఉంటే వారికి మూడు, నాలుగు మీటర్లు ఉన్నట్టు చూపడం, దానితోపాటు 2.25 సెంట్లు స్థలంలో ఇండ్లు ఉన్నా, 300 యూనిట్లలోపు కరెంటు కాల్చినా, అర్బన్ ప్రాపర్టీ కింద ఇండ్లు టౌన్‌లో ఉన్నా, మాగాని మూడు ఎకరాలు, మెట్ట భూమి అయితే పది ఎకరాలు ఉన్నా ఇలా నిబంధనలను చూపుతూ ఆత్మకూరు పట్టణంలో దాదాపు 350 నుంచి 400 దాకా వివిధ రకాల పెన్షన్లను తొలగించడం అన్యాయమని అన్నారు. ఒకవైపు జనవరి ఒకటో తేదీ నుంచి పెన్షన్‌లో ఇచ్చే అమౌంట్ పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి మరోవైపు వివిధ రకాల నిబంధనలతో తొలగించడం పెన్షన్‌దారులపై ఏ మేరకు ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. షరతులతో తొలగించిన పెన్షన్లను వెంటనే పునరుద్ధరించాలని, లేనిపక్షంలో తొలగించిన పెన్షన్‌దారులను సమీకరించి సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.




విద్యుత్ దీపాలతో క్రిస్టమస్ వేడుకలకు ముస్తాబైన చర్చి

క్రిస్మస్‌కు చర్చీలు ముస్తాబు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

నేడు క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని నంద్యాల జిల్లాలోని అన్ని పట్టణ, మండల, గ్రామాల్లో చర్చీలన్నీ ముస్తాబు అయ్యాయి. బండి ఆత్మకూరు మండలంలోని మండలంలోని సిఎస్ఐ, రోమన్ క్యాథలిక్, ఎబిఎన్ చర్చిలతో పాటు పలు చర్చిలను విద్యుత్ దీపాల అలంకరించారు. శనివారం అర్ధరాత్రి ఏసుక్రీస్తు జననం జరుగుతున్న సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులు అర్ధరాత్రి ప్రార్ధనలకు క్రైస్తవ మందిరాలను సిద్ధం చేశారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శ్రీ కృష్ణదేవరాయ బలిజ కాపు తెలగ ఓంటరి నిత్యాన్నదాన సత్రం-2023 నూతన క్యాలెండర్‌ను శనివారం సత్రం అధ్యక్షులు శెట్టి విజయ్ కుమార్, గౌరవ సలహాదారుడు గోగిశెట్టి నరసింహారావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్రంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. సత్రం అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని చెప్పారు. అన్నివర్గాల వారికి సత్రం సేవలను అందిస్తామని చెప్పారు. సంఘం అభివృద్ధికి ఐక్యమత్యంగా కృషి చేస్తామన్నారు. విద్య, రాజకీయం, ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సిద్ధం శివరాం, పోలా గురుమూర్తి, నీలి శ్రీనివాసులు బాబు, గూడూరు సంజీవరాయుడు, రామచంద్రుడు, కస్టేటి నాగేశ్వరరావు, నీలి చంద్రశేఖర్, సుకర కైలాసనాద్, కొండపేట వెంకట వీరయ్య, గంతి శ్రీను, మైలేరి మల్లయ్య, శివ రాయల్, శ్రీను, హరి ఓం కష్ణ, గురు ప్రసాద్, ఉప్పు శివ, నవీన్, శ్రీనివాసులు, ఇతర సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


2023 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సత్రం నాయకులు



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

వృద్ధులకు చీరలు పంపిణీ

ఆళ్లగడ్డ : పట్టణంలోని సద్గాం కాలనీలో సత్య రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో అనాధ వృద్ధులకు వెంకయ్య, మేరమ్మ దంపతులు చీరలు శనివారం పంపిణీ చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా వెంకయ్య, మేరమ్మ దంపతులు నిరాశ్రయుల వసతి గృహం నిర్వాహకుడు ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో చీరలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఉన్నంతలో ఇతరులకు సహాయపడడంలో ఉన్న ఆనందం మరెందులోనూ లేదన్నారు.

సఫాయి కార్మికుల సంఘం జిల్లా సభ్యునిగా కోవెల రవికుమార్

బేతంచర్ల : సఫాయి కార్మికుల సంఘం నంద్యాల జిల్లా సభ్యునిగా బేతంచర్ల పట్టణానికి చెందిన కోవెల రవికుమార్ ఎన్నికయ్యారు. ఈ మానిటరింగ్ కమిటీలో నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని, ఆఫీషియ మెంబర్గా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సభ్యులుగా ఉంటారు. జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా మున్సిపాలిటీ, జిల్లా కండోన్మెంట్ బోర్డు, రైల్వే హెల్త్, ఇన్సూరెన్స్, డిసిసి జిల్లా బ్యాంక్ మేనేజర్, పంచాయతీరాజ్ జిల్ల ఇంజనీరు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కమిటీలో ఉంటారు. అంబటిపూడి వెన్నెమ్మ, కోవెల రవి కుమార్, ప్రహ్లాదలకు కలెక్టర్ ఉత్తర్వులు కాపీని అందజేశారు.



మృతి చెందిన నరసింహా చారి

కెసి కెనాల్‌లో గల్లంతైన దంపతులలో భర్త మృతదేహం లభ్యం

పాములపాడు : మండలంలోని జూటూరు గ్రామ సమీపంలో శుక్రవారం కెసి కెనాల్ కాలువలో దంపతులు గల్లంతయిన సంఘటనలో భర్త నరసింహ చారి మృతదేహం శనివారం పాములపాడు సమీపంలో లభ్యమయింది. పోలీసులు నరసింహచారి మృతదేహాన్ని ఆత్మకూర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఘటనపై ఎస్సై హుస్సేన్ భాష కేసు నమోదు చేసుకున్నారు. ఆయన భార్య సుమిత్ర మృతదేహం ఇంకా లభ్యం కాకపోవడంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

ఉపాధి కోర్సులకు ఉచిత శిక్షణ

రుద్రవరం : ఉపాధి కోర్సులకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎర్రగుంట్ల జిటిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా స్కిల్ హబ్ సెంటర్ ఎర్రగుంట్ల జిటిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకౌంటెంట్ ఎగ్జిక్యూటివ్ (ట్యాలీ) డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అసిస్టెంట్ (డిపిఓస్) కోర్సుల్లో 3 నెలల పాటు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. 18 నుంచి 28 ఏళ్ల వయసు గల డిగ్రీ విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గలవారు విద్యార్హత, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, 3 ఫోటోలతో కళాశాలలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9701303790 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

31 వరకు ఈకెవైసికి అనుమతి

నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల జిల్లాలో పిఎం కిసాన్ పథకానికి నోచుకోని 56,998 మంది రైతులు ఈ నెల 31వ తేదీ వరకు బ్యాంకులో ఆధార్ లింకు, ఎన్‌పిసిఐ, ఈకేవైసీ చేయించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి టి.మోహన్ రావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలోని 2వ వార్డ్‌లో 14వ ఫైనాన్స్ కింద మంజూరైన డ్రెయినేజీ కాలువల నిర్మాణ పనులను మున్సిపల్ వైస్-చైర్మన్ మొల్ల రబ్బానీ, 2వ వార్డ్ కౌన్సిలర్ మొల్ల జాకీర్ హుస్సేన్‌లు శనివారం భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ, అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రజలకు అభిమానాన్ని మరింత పెంచుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ నాయకులు రహంతుల్లా, ముజీబ్, అజం, రియాజ్, రియాజ్(హండి), పసుల శ్రీనివాసులు నాయుడు, సోషల్ మీడియా కో-కన్వీనరు చాంద్‌బాషా, హబీబ్(వాలంటీర్), రసూల్ ఖాన్, అబ్బాస్, ఆఫ్రిద్ తదిరులు పాల్గొన్నారు.



దుస్తులు అందజేస్తున్న దృశ్యం

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ

బేతంచర్ల : బేతంచర్ల నగర పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులకు పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి శనివారం దుస్తులు, ఆయిల్, సబ్బులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ మునిసిపల్ పారిశుధ్య కార్మికులు బేతంచర్ల పట్టణంలో వీధులు, కాలువలు, రోడ్లు శుభ్రం చేస్తున్నారని, వారిని అభినందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ నాయక్ అకౌంటెంట్ సుజాత, జూనియర్ అసిస్టెంట్ రాజేష్, శానిటేషన్ అధికారి సుజాత, విష్ణు, రమణ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థిని ప్రతిభ

జూపాడుబంగ్లా : జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో స్థానికమోడల్ స్కూల్ విద్యార్థిని వై. సుప్రజ ప్రతిభ కనబరిచారు. 9వ తరగతి సుప్రజ వక్తృత్వ పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయిలో 3వ స్థానంలో నిలిచింది. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఎస్ఒ, డిఇఒ అనురాధ చేతుల మీదుగా సుప్రజ నగదు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సుప్రజను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు అభినందించారు.

చాగలమర్రి వాసికి ఉత్తమ సేవా పురస్కారం

చాగలమర్రి : చాగలమర్రి పట్టణానికి చెందిన కడప ఏపిఎస్‌పి బెటాలియన్‌లో పోలీస్ విధులు నిర్వహిస్తున్న టంగుటూరు రంజిత్‌కుమార్‌కు వరల్డ్ స్టేట్ లెవెల్ పీస్, భారతీయరత్న ఉత్తమ సేవా పురస్కారాలు దక్కాయి. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత మాట్లాడుతూ హైదరాబాదుకు చెందిన మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అనే స్వచ్ఛంద సంస్థ పలు రంగాల్లో సామాజిక సేవలందించిన వారిని గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశారన్నారు. కరోనా, ఇతర సమయాల్లో చేపట్టిన పలు సేవా కార్యక్రమాలను గుర్తించి తనకు ఈ అరుదైన అవకాశాన్ని అందించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఇలాంటి సేవలను నిరంతరం కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

జీవో 174ను రద్దు చేయాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - నందికొట్కూరు

నిరుపేదల పెన్షన్లకు ఆటంకం కలిగించే జీవో నెంబర్ 174ను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నందికొట్కూరు మున్సిపాలిటీ పట్టణంలోని అల్లూరు రోడ్డు చాకలికొటాలలో ఉన్న 7వ సచివాలయం వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్.నామతల్లూ, మహిళా పోలీస్ ఆఫీసర్ లావణ్యలకు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒకటి చెప్పి నేడు మరొకటి చేస్తున్నారని, అనేక రకాల పెన్షన్లకు ఆటంకంగా జీవో 174 తీసుకువచ్చి గత 70 సంవత్సరాలుగా పెన్షన్లు తీసుకుంటున్న లబ్ధిదారులకు మొండి చేయి చూపడం తగదన్నారు. మున్సిపాలిటీల్లో 300 విద్యుత్తు యూనిట్లు కాలినా, వెయ్యి చదరపు అడుగుల ఇంటి నివాసం ఉన్న వారందరికీ సచివాలయం ద్వారా నోటీసులు పంపించి పెన్షన్ రద్దు చేస్తామని చెప్పడం పిచ్చుకపై బ్రహ్మాస్త్రం ఉపయోగించే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జీవో 174ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలు గ్రామపంచాయతీల కంటే అధ్వాన్నంగా ఉన్నాయని, 2011లో నందికొట్కూరు మున్సిపాలిటీ ఏర్పాటు అయినా ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. పేదల పెన్షన్లకు నష్టం కలిగించే జీవోను తక్షణమే రద్దు చేయాలని, లేనిపక్షంలో పెన్షన్‌దారులతో పెద్ద ఎత్తున మున్సిపల్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నారాయణ, మధు బాబు, కృష్ణుడు, సిఐటియు మండల కార్యదర్శి సి.నాగన్న, మహిళా సంఘం నాయకురాలు ఎస్ బేబీ, నాగలక్ష్మమ్మ, మాడిగట్ల లక్ష్మీదేవి, ఎరుకల లక్ష్మమ్మ, రజియా తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎన్‌జిఒ కాలనీ ఆటో డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీకి చెందిన ఆటో డ్రైవర్లు 50 మందికి గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి దస్తగిరి రెడ్డి యూనిఫాం దుస్తులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ ఎన్జీవో కాలనీ ఆటో డ్రైవర్స్‌కు అండగా ఉంటామన్నారు. నిరంతరం వారి సంక్షేమానికి పాటుపడతామని వివరించారు. ఎన్జీవో కాలనీ ఆటో డ్రైవర్లు బ్యాంక్ కోచింగ్ విద్యార్థులతో మమేకమై ఉండాలని సూచించారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం కోరగా వెంటనే అందజేశామన్నారు. కార్యక్రమంలో శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలి రెడ్డి, షేక్షావలి రెడ్డి ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత ఆత్మకూరు జట్టు

ప్రజాశక్తి - వెలుగోడు

మండలంలోని రేగడ గూడూరు గ్రామంలో క్రిస్మస్ పండగ సందర్భంగా ముక్తార్ భాష యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలల్లో ఆత్మకూరు జట్టు విజేతగా నిలిచింది. ఈ నెల 23, 24 తేదీలలో జరిగిన కర్నూలు ఎస్ఆర్ జూనియర్ కళాశాల టీమ్ రఘువీరా శనివారం ప్రారంభించారు. మొత్తం 27 జట్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతిని దాత లాడెన్ ఖాదర్ వలి గెలుపొందిన ఆత్మకూర్ జట్టుకు రూ. 8016, రెండో బహుమతి రూ. 4016, మూడో బహుమతి రూ. 2016లను ఎన్‌వైఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ముక్తార్ భాషా క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో ముక్తార్ భాష యూత్, విద్యార్థులు సందీప్, కమలి, అశోక్ కుమార్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలో పాల్గొన్న జట్టుతో ముక్తార్ భాష



జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని సంబంధిత లబ్ధిదారులకు ఎంపీడీవో సుబ్బరాజు సూచించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని కల్వటాల లే అవుట్‌లో లబ్ధిదారులతో ఆయన పలు సమస్యలపై చర్చించి వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కల్వటాల గ్రామానికి 59 ప్లాట్స్ మంజూరు అయ్యాయని, 26 ఇళ్లకు నిర్మాణాలు, 11 ఇళ్ల బేస్ మెంట్ స్టేజ్‌లో ఉన్నాయని, లబ్ధిదారులు అందరూ త్వరితగతిన చేపట్టి సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, హౌసింగ్ ఏఈ మద్దిలేటి, ఆర్టర్ హుస్సేన్, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ సురేంద్ర, వాలంటీర్లు షేయాజ్, వినయ్, చిన్నచెన్నయ్య లబ్ధిదారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - బనగానపల్లె

జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా నంద్యాల జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో బనగానపల్లె మోడల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థి మహేష్ బాబు ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండవ స్థానంలో నిలిచి బహుమతిని సాధించినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామలక్ష్మి శనివారం తెలిపారు. విద్యార్థి మహేష్ బాబు డిఇఒ అనురాధ చేతుల మీదుగా సర్టిఫికెట్, మెమెంటోతో పాటు 2 వేల రూపాయల నగదు అందుకున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థి మహేష్ బాబును పాఠశాల ప్రిన్సిపల్ రామలక్ష్మి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

బహుమతులు అందుకుంటున్న మోడల్ స్కూల్ విద్యార్థి



బొల్లు ప్రసాద్ బాబుకు ప్రశంసా పత్రం

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండల వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షులు బొల్లు ప్రసాద్ బాబు జిల్లా అధికారుల చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవ పురస్కరించుకొని శనివారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమావేశంలో జిల్లా విద్యాధికారి అనురాధ, జిల్లా పౌరసరఫరాల అధికారి ఆచార్యులు, డిఎస్ఒ ప్రసాదరావులు ప్రశంసా పత్రంతో పాటు మెమొంటోను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బొల్లు ప్రసాద్‌బాబును పలువురు అభినందించారు. పలు ప్రాంతాల వినియోగదారుల అధ్యక్షులు విజయ్, శ్రీనివాసులు, ఆల్ఫ్రెడ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న బొల్లు ప్రసాద్ బాబు

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -చాగలమర్రి

చాగలమర్రిలోని న్యూ ఎస్సీ కాలనీలో టిడిపి ఆధ్వర్యంలో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల పార్లమెంట్ మైనారిటీ సెల్ నాయకులు కొలిమి హుస్సేన్‌వల్లి, తెలుగు నాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు, బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఆలంసా గారి హనీఫ్, నాయకులు భూమా అభిమానులు కార్యకర్తలు కేక్ కోసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు క్రిస్మస్ పండుగ విశిష్టతను కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొలిమి షరీఫ్, ఆలంసా గారి మౌలాలి, పట్టణ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కొలిమి సోను, మల్లా అజిమద్దిన్ ఆకుల ఇర్షాద్ నాగ శేషు, ఎంఎస్ అలీమ్, కసినేని ఓబులేష్, శంకర సుబ్బారావు జెట్టి, సుధాకర్, నాగూర్ భాష, జిలేబి, షరీఫ్, చాంద్ బాషా, జోసెఫ్, రాజేష్, జమ్మలమడుగు భాష, షామీర్ వీరం రెడ్డి భాస్కర్ రెడ్డి బషీర్, అరుణ్, గాంధీ జోసెఫ్, ఆర్.మాభాష, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

డోన్ : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బెత్సేమనే చర్చ్ పాస్టర్ సామ్యూల్ బైబిల్ వాక్యాలు తెలియజేశారు. ముఖ్యఅతిథిగా ఆర్టీసీ డీఎం శశి భూషణ్ హాజరయ్యారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ స్టేట్ లీడర్ సుదర్శన్ రావు, జిలాని, ఓబులేసు, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

బాల అకాడమీలో ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

నంద్యాల : నంద్యాల పట్టణంలోని పార్క్ రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు శాంటా క్లాస్, ఏంజిల్స్, తూర్పు దేశపు జ్ఞానులు (రాజులు)గా మేరీ, జోసెఫ్ గొర్రెల కాపరుల వేషధారణలతో అలరించారు. ఉపాధ్యాయులు క్రిస్మస్ పండగ ఉద్దేశ్యం వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎమ్.జి.వి. రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత, విద్యార్థిని విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చాగలమర్రిలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు



డోన్‌లో కేకును కట్ చేస్తున్న ఆర్టీసీ డీఎం శశిభూషణ్



బాల అకాడమీ పాఠశాలలో వేషధారణలతో చిన్నారులు

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజు తన పెద్ద కుమారుడు కాటసాని నాగార్జున రెడ్డి జ్ఞాపకార్థం రాయలసీమ జోనల్ స్థాయి గ్రేస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. ఈ టోర్నమెంట్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.1,00,000, రెండవ బహుమతి రూ.50,000 అందజేయనున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో వర్షపు నీరుతో హైస్కూల్ గ్రౌండ్ మొత్తం నిండిపోయి వాకర్స్‌కు చాలా ఇబ్బందిగా ఉండేదని, అయితే తన సొంత ఖర్చులతో గ్రౌండ్‌ను ఆధునీకరించామని చెప్పారు. ఈ గ్రౌండ్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌ను, కాటసాని ఓబుల్ రెడ్డి స్నేహితులతో కలిసి ఈ గ్రౌండ్ ను అధునికరించడం తనకు చాలా ఆనందంగా ఉందని చెప్పారు. రాయలసీమ జోనల్ స్థాయి పోటీలకు 50 టీములు ఎంట్రీ చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని, టోర్నమెంట్‌లో ఎక్కడ కూడా ప్రాంతీయ వివక్ష లేకుండా నిర్వహించాలని నిర్వాహకులకు, అంపైర్లకు ఎమ్మెల్యే సూచించారు. కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరెన్నో సేవా, సామాజిక కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామకృష్ణ, వైసిపి అధ్యక్షుడు గుండం నాగేశ్వర్ రెడ్డి, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, యాగంటి దేవస్థానం పాలకమండలి చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, వార్డు మెంబర్ సురేష్, సీనియర్ సిటిజన్ షటిల్ క్రీడాకారుడు శ్రీరాములు, నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, ఎర్రగుడి సుబ్బారెడ్డి, కాటసాని ఓబుల్ రెడ్డి యూత్ సభ్యులు, క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

ఆళ్లగడ్డ : మండలంలోని కోటకందుకూరు, జి.జంబుల దిన్నె గ్రామాలలో ఖాళీగా ఉన్న గ్రామ వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడివో సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కోట కందుకూరులో (ఓసి జనరల్, పురుషులు, స్త్రీలు -1), జి.జంబులదిన్నెలో ఎస్సీ(స్త్రీలు) -1 ఖాళీలకు దరఖాస్తు కోరుతున్నట్లు చెప్పారు. పదవ తరగతి ఉత్తీర్ణత కలిగి 18 నుండి 35 సంవత్సరాలలోపు వయసు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 26 నుండి 28లోగా సంబంధిత వెబ్ సైట్ లోనే దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు. **పాములపాడు :** పాములపాడు మండలంలో ఖాళీగా ఉన్న 5 వాలంటరీ పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సుమిత్రమ్మ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ మద్దూరు గ్రామంలో జనరల్ మహిళ 1, వేంపెంట గ్రామంలో బిసి-డి పురుషులు 2, జూటూరు-2 గ్రామానికి బిసి-డి పురుషుడు-1, ఎర్ర గూడూరు గ్రామానికి బిసి-బి మహిళ-1 పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పదవ తరగతి పాసై ఉండి 18 నుండి 35 సంవత్సరాల లోపల అర్హత కలిగిన వారు ఈ నెల 26 నుండి 27 తేదీల్లోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి 28 పరిశీలన, 29 సెలెక్షన్ కమిటీ ఇంటర్వ్యూ, 30న ఎంపికైన వారి పేర్ల ప్రకటన, ఎంపికైన అభ్యర్థులకు 31న శిక్షణ, జనవరి 2న నియామకం ఉంటుందని తెలిపారు. **పగిడ్యాల :** పగిడ్యాల మండలంలో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. ఈ నెల 26 నుండి 27వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నెహ్రూనగర్ సచివాలయం-2 పరిధిలో బిసి మహిళ-1, పగిడ్యాల సచివాలయం-2 పరిధిలో ఎస్సీ మహిళ-1, లక్ష్మాపురం సచివాలయం-1 పరిధిలో జనరల్ పురుషులు 1 పోస్టులను రిజర్వుడు చేసినట్లు చెప్పారు. అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

కొత్త మార్గాల్లో సైబర్ నేరగాళ్లు

- జిల్లా ప్రజలు జాగ్రత్తగా ఉండాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

క్రిస్మస్, న్యూఇయర్ గిఫ్ట్‌లు అంటూ సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారని, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు మారుతున్న సమాజంలోని పరిస్థితులకు అనుగుణంగా సైబర్ నేరగాళ్లు వారి నేర విధానాన్ని మార్చుకుంటూ ప్రజలను మోసం చెయ్యడానికి కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారని తెలిపారు. పండుగ సీజన్ ప్రారంభమైన వెంటనే ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫామ్‌లలో విపరీతమైన విక్రయాలు ప్రారంభమవుతాయని, కొంత మందికి క్రిస్మస్, న్యూఇయర్ గిఫ్ట్‌లు అంటూ వాట్సాప్ లేదా ఇమెయిల్‌లో సందేశాలు, లింక్‌లు పంపుతుంటారని పేర్కొన్నారు. ఆ లింక్‌లను క్లిక్ చేసి మోసపోవద్దని, చిన్నగా రూ.500 అమెజాన్ గిఫ్ట్ కార్డ్‌ను గెలుచుకోండని వస్తుంటాయని, ఆ లింక్‌లపై క్లిక్ చేసిన తర్వాత దానితో ఓ లింక్ కూడా ఉంటుందని, దీనికి ఇచ్చే కాప్షన్ కూడా మిమ్ములను ఆ లింక్ క్లిక్ చేసే విధంగా పురిగొల్పుతుందని, ఆ లింక్‌పై క్లిక్ చేస్తే అసలు వెబ్‌సైట్‌లా కనిపించే క్లోన్ చేసిన వెబ్‌సైట్ తెరవబడుతుందని, మీ వ్యక్తిగత వివరాలు.. మీరు ఇచ్చుకుంటూ పోయిన తరువాత, మీ ఫోన్ నంబర్ ఆధారంగా మీ బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బులు ఖాళీ అవుతాయని హెచ్చరించారు. అపరిచితుల నుంచి వచ్చిన లింక్‌లపై క్లిక్ చేయవద్దని, మీ వ్యక్తిగత సమాచారం, పాన్‌కార్డు నంబర్, పాన్‌కార్డ్ ఫొటోలు అపరిచిత లింక్‌లలో పంచుకోవద్దని, ఆన్లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఒకవేళ ఏదైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే సంబంధిత బ్యాంక్, మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయాలని, లేదా సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు, మీ దగ్గరలోని పోలీసు స్టేషన్ నంబర్‌కు కాల్ చెయ్యాలని, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

రేషన్ కార్డుల తొలగింపు అన్యాయం : టిడిపి

ప్రజాశక్తి - ప్యాపిలి

విద్యుత్ 300 యూనిట్‌లు కరెంట్ బిల్లు వస్తే రేషన్ కార్డు తొలగించడం అన్యాయమని టిడిపి డోన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం ప్యాపిలిలోని 9వ వార్డులో ఇదేం కర్మ మన రాష్టానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలో వచ్చిన ఈ మూడున్నర సంవత్సర కాలంలో విపరీతంగా గంజాయి తోటలను పెంచి రాష్ట్రాన్ని గంజాయి రాష్ట్రంగా మారుస్తున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో ఉద్యోగస్తులకు సరైన సమయంలో జీతాలు ఇవ్వక లేక వారిని అప్పులపాలు చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వ అవినీతి పాలన నుంచి విముక్తి కావాలంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు టిడిపికి ఓటు వేసి చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణ గౌడ్, విజయ్ భట్, వెంకటేశ్వర రెడ్డి, రామ సుబ్బయ్య, సుంకయ్య, రామ్మోహన్ ఖాజాపీర్, సుదర్శన్, గండికోట రామాంజనేయులు, అభిలాష్ రెడ్డి, రామిరెడ్డి, రాము, బ్యాంక్ శీనువాసులు, బాలరంగన్న పాల్గొన్నారు. **బేతంచెర్ల :** రాష్ట్రం ప్రభుత్వం చేసిన అప్పులకు రేషన్, పింఛన్లలో కోతలు విధించడం జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శనమని టిడిపి మండల కన్వీనర్ వి.నాగయ్య, పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరి విమర్శించారు. శనివారం పట్టణంలోని 8వ వార్డులో షేక్షావలి చౌదరి ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. డోన్ నియోజకవర్గం గౌరవ సలహాదారుడు కాకర్ల తిరుమలేశ్ చౌదరి, బేతంచెర్ల పట్టణ సమన్వయ కమిటీ చైర్మన్ సుధాకర్, బుగ్గానపల్లి రమేష్, రాష్ట్ర ముస్లిం మైనారిటీ సంఘం నాయకులు జాకీరుల్లా బేగ్, రమేష్ రెడ్డి, నంద్యాల మధు, అరుణ్ కుమార్, కౌన్సిలర్ ఆంజనేయులు, అంజి, కమిటీ ఉపాధ్యక్షుడు జవ్వాజి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఇదేమి కర్మ మన రాష్టానికి కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

28న గ్రామ పంచాయతీల ప్రణళిక పై శిక్షణ : ఎంపిడిఒ

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని గ్రామ పంచాయతీల ప్రణళికలపై ఈనెల 28, 29న గ్రామ పంచాయతీ స్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వెంకటరమణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. ఆయా గ్రామ పంచాయతీల 2023 -24 అభివృద్ధి ప్రణాళిక తయారీపై గ్రామ స్థాయి శిక్షణ ఈ నెల 28న పగిడ్యాల, లక్ష్మాపురం, ప్రాతకోట, ఎం.ఘణపురం గ్రామాలకు, 29న సంకిరేణిపల్లే, పాత ముచ్చుమర్రి, కొత్త ముచ్చుమర్రి, నెహ్రూనగర్ గ్రామ పంచాయితీలలో శిక్షణ నిర్వహిస్తా మన్నారు. ప్రభుత్వ శాఖల సిబ్బంది, సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, స్వయం సహాయక గ్రూపు లీడర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, సచివాయల సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని కోరారు.

వైసిపి ప్రభుత్వంలో విద్యార్థులకు పెద్దపీట : చైర్మన్

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంలో విద్యార్థులకు పెద్దపీట వేస్తోందని, కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తోందని ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా అన్నారు. శనివారం పట్టణంలోని ఉర్దూ జిల్లా ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బాలికలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి చొరవతో నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు కింద అభివృద్ధి చేస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకున్నప్పుడే విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక గౌరవం సమాజంలో దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా



మీకోసం

నూనె జిడ్డు బాగా అంటుకున్న పాత్రలను మొదట వేడినీటితో కడగాలి. ఆ తర్వాత అంట్ల సబ్బుతో తోమాలి.

జీవన సారథం

లేని గొప్పతనాన్ని ప్రదర్శిస్తే, నిజమైన గొప్పతనం మరుగున పడుతుంది.

క్రిస్మస్ వేడుకలు



పిల్లలూ, ఈ రోజు క్రిస్మస్ పండగ. ఆ సందడి విశేషాలు తెలుసుకుందామా!



క్రిస్మస్ ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు జరుపుకునే పండుగ. వివిధ దేశాల్లో ఈ సందర్భంగా నిర్వహించే వేడుకల్లో కొన్ని క్రైస్తవ పూర్వపు పద్ధతులు, కొన్ని లౌకిక విధానాలు ఉన్నాయి. ఈ వేడుకల్లో బహుమతులు ఇవ్వడం, ఎడ్వంట్ క్యాలెండర్ ఆవిష్కరించడం, కొవ్వొత్తులు వెలిగించడం, క్రిస్మస్ సంగీతం, గీతాలాపన, క్రీస్తు జననం ప్రదర్శన, సామూహిక ప్రార్థనలు, ప్రత్యేక విందు, క్రిస్మస్ చెట్టు వంటివాటితో కూడిన అలంకరణలు ఉంటాయి. క్రిస్మస్‌కు చాలా రోజుల ముందే పండుగ సందడి మొదలవుతుంది. దీనికోసం క్రైస్తవులు తమ ఇళ్లను, చర్చిలను అందంగా అలంకరిస్తారు. వెదురు బద్దలు, రంగుల కాగితాలతో ఒక పెద్ద నక్షత్రాన్ని తయారుచేసి ఇంటిపై వేలాడదీస్తారు. తమ ఇంట్లో క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేస్తారు. దీన్ని రంగు రంగుల కాగితాలు, నక్షత్రాలు, చిరుగంటలు, చిన్న చిన్న గాజు గోళాలతోను అలంకరిస్తారు.

పల్లెటూళ్లలో పండుగ నెల రోజుల్లో ఉందనగా ఇంటిని ముస్తాబు చేసుకోవడం మొదలు పెడతారు. అరిసెలు మొదలగు పిండివంటలకు సన్నాహాలు చేస్తారు. మరోవైపు యువత, 'క్రీస్తు జయంతి' నాటికను ప్రాక్టీస్ చేయడం, వెదురు కర్రలతో 'స్టార్' తయారు చేయడం లాంటి పనుల్లో మునిగిపోతారు. క్రిస్మస్ తాత వేషధారణతో బహుమతులు, గ్రీటింగ్‌కార్డులు ఇచ్చుకుంటూ ఆనందం వ్యక్తపరుచుకుంటారు. గతంలో కొందరు తమ పేర్లు, ఫొటోను కూడా ముద్రించి మరీ గ్రీటింగ్ కార్డులు 'ప్రింట్' చేయించి బంధుమిత్రులకు పంపేవారు. క్రమంగా 'క్రిస్మస్' గ్రీటింగ్స్ ప్రాధాన్యం 'న్యూ ఇయర్'కు బదిలీ అయింది. దాంతో సమాజంలోని అందరూ 'న్యూ ఇయర్' గ్రీటింగ్స్ పంపుకోవడం సర్వసాధారణమైంది. మానవ సంబంధాలను బలోపేతం చేసే ఎవరి పండగ అయినా– అందరికీ పండగే, సందడే! విష్ యూ హ్యాపీ క్రిస్మస్..

- షఫేలా ఫ్రాంకిన్ సెన్స్

నేను గీసిన బొమ్మ





- జి. యోగ అభినవ్ సాయి,
1వ తరగతి,
శ్రీ చైతన్య స్కూలు,
అద్దంకి,
బొడ్డువానిపాలెం,
బాపట్ల జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆటలే ప్రాణంగా ...

'వికలాంగులు కొన్ని ఆటలు మాత్రమే ఆడగలరు. క్రికెట్, కబడ్డీ వంటివి ఆడలేరు' అన్న అభిప్రాయం కొందరిలో ఉంటుంది. కానీ, సుబ్బయ్య తిరుమలై కుమార్‌ను చూస్తూ ఆ అభిప్రాయాన్ని మార్చుకోవాలి! పోలియోకు గురై కుర్చీకే పరిమితైన తను కబడ్డీ క్రీడాకారులను చూసి స్ఫూర్తి పొందారు. 'నేను ఎందుకు ఆడలేను?' అని ప్రశ్నించుకున్నారు. తనకు ఎందుకు ఆటలు నేర్పించరని, చేర్చుకోరని టీచర్లనే ప్రశ్నించారు. ఇష్టంతో, పట్టుదలతో చేసిన సాధన ఆయన్ని అంతర్జాతీయ క్రీడాకారుని స్థాయికి చేర్చింది. రైల్వేలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని బంగారు, వెండి బహుమతులు పొందారు. ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదగా 'శ్రేష్ఠ దివ్యాంగజన్' అవార్డును అందుకున్నారు. తిరుమలై గురించి తన మాటల్లోనే విందాం.

'మాది తమిళనాడులో విరుత్‌నగర్ జిల్లా, తవాయిపురం. చిన్న మారుమూల గ్రామం. మా నాన్న సుబ్బయ్య రైతు. కష్టజీవి. ఎప్పుడూ పొలం పనులతో నిత్యం శ్రమిస్తారు. అమ్మ గృహిణి. ఇద్దరు అక్కలు, అన్నయ్య ఉన్నారు. అందరి కన్నా చిన్నవాడినని నన్ను అందరూ బాగా చూసుకునేవారు. నేను తొమ్మిది నెలల వయసులో కుడికాలికి పోలియో వచ్చింది. దాంతో నాకు నడక ఆలస్యం అయ్యింది. దోగాడటం, పాకడం కష్టంగా ఉండేది. దాంతో అమ్మ నన్ను అంటిపెట్టుకుని ఉండేది.

ఆటలు ఆడలేవన్నారు

ఊరిలో నేనొక్కడినే వికలాంగుడిని. దాంతో స్కూల్లో పిల్లలంతా నన్ను వింతగా చూసేవారు. జనం నన్ను చూసి జాలిపడుతూ 'ఎలా బతకుతాడో? ఏ పని చేయలేడు' అంటూ జాలి మాటలు మాట్లాడేవారు. చదువుకోవాలన్న ఆసక్తితో కుంటుకుంటూనే స్కూలుకు వెళ్లేవాడిని. బాల్యం అర్థమవుతున్న దశలో తోటి పిల్లలు 'ఆటలు ఆడేందుకు పనికి రావు' అని దూరంగా పొమ్మనేవారు. మానసికంగా బాధపడ్డా. క్రికెట్, వాలీబాల్ ఆడుతున్న తోటి పిల్లల కాళ్ల వైపు చూస్తూ ఉండేవాడిని. నేనూ ఆడతానని బతిమిలాడేవాడిని. కాని హేళనగా మాట్లాడేవారు. ఆ మాటలకు ఇంటికి వచ్చి ఏడ్చిన సందర్భాలు ఎన్నో. అమ్మ ధైర్యంగా ఉండమని మంచి మాటలు చెప్పేది. దాంతో క్లాసులో కూర్చుని హోంవర్క్ చేసుకుంటూ, రాని పాఠాలు చదువుకునే వాడిని.

హెడ్‌మాస్టర్‌నే ప్రశ్నించి ...

తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు పక్క ఊరిలో మండల స్థాయి కబడ్డీ పోటీలు మూడు రోజులు నిర్వహించారు. పిల్లలంతా వెళుతుంటే వారితో పాటు వెళ్లా. స్నేహితులతో కలిసి అక్కడే తిని, పడుకున్నాం. ఆ క్రీడాకారులను చూసి నాకూ ఆడాలనిపించింది. పీఈటి మాస్టారితో గొడవ పడ్డాను. ఆటల్లో ప్రవేశం కల్పించమని కోరా. కాని ఆయన మాత్రం ఒప్పుకోలేదు. దాంతో స్కూలు హెడ్‌మాస్టర్ దగ్గరకు వెళ్లి ప్రశ్నించా. 'నన్ను ఎందుకు ఆటలు ఆడనివ్వరు... ఒకసారి క్రీడల్లో అవకాశం కల్పించమని' కోరా. ఆయన బాధ్యతతో ఆటల్లో కబడ్డీ, ఫుడ్‌బాల్, ఖోఖోలో శిక్షణ ఇచ్చారు. మొదట్లో ఇబ్బంది పడ్డా. ఇష్టంతో ఆడటం వల్ల కష్టంగా అనిపించలేదు. మామూలు పిల్లలతో కలిసి పోటీ పడటం చూసి పీఈటీ మాస్టారు ఆశ్చర్యపోయారు. వెన్నుతట్టారు. దాంతో క్రీడల్లో మంచిస్థాయికి ఎదగాలని దృఢంగా నిశ్చయించుకున్నా. వెనక్కి తిరిగి చూడలేదు. పదో తరగతిలో సెలవు రోజుల్లో, ఖాళీ సమయంలో గ్రౌండ్‌కు వెళ్లి గంటల తరబడి క్రికెట్, కబడ్డీ ఆడేవాడిని. అవతల టీం సభ్యులు నన్ను చూసి... 'కాలు సరిగ్గా లేదు. వీడిని త్వరగా ఔట్ చేయొచ్చు' అనుకునేవారు. ఎక్కించేవారు. అవేమి పట్టించుకుండా బరిలో దిగేవాడిని. వికలాంగులకు విడిగా ఆటలు శిక్షణ, పోటీలు ఉంటాయని తెలియదు. మొదటిసారి పండగ సందర్భంగా పక్క ఊరి టీంతో పోటీగా నిలబడ్డాం. అందరిలా గట్టి పోటీ ఇచ్చి రూ.100 నగదు మొదటి బహుమతిగా పొందాం. ఆ సంతోషం ఎప్పటికీ మర్చిలేను.

అమ్మ మృతి కుంగదీసింది

ఇంటర్‌లోనూ కాలేజీ అయిన వెంటనే గ్రౌండ్‌కు వెళ్లి ఆటలు ఆడేవాడని. దాంతో అన్నయ్య అరిచేవారు. కాని నాన్న, అమ్మ



మాత్రం నాకు నచ్చింది చేయమని ప్రోత్సహించేవారు. దాంతో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనడం మొదలు పట్టా. అప్పుడే అమ్మకు కిడ్నీ వ్యాధి సమస్య వచ్చింది. ఆమెను చూసి దిగులు పట్టుకుంది. చదువు మీద ధ్యాస తగ్గింది. ఆటలకు వెళ్లడం మానేశా. ఆమెను డయాలసిస్ కోసం రోజూ ఆసుపత్రికి తీసుకెళ్లి వచ్చేవాడిని. నెలల్లోనే ఆరోగ్యం క్షీణించి చనిపోయింది. ఆమెను మరిచిపోలేక రోజులు తరబడి ఏడిచా. టోర్నమెంట్స్‌కు వెళ్లలేదు. ఇంటర్ ఫైనల్ ఎగ్జామ్స్‌లో ఒక సబ్జెక్టు తప్పా. నా మానసిక పరిస్థితి చూసి నాన్న, తెలిసిన వాళ్లు ధైర్యం చెప్పారు. 'నీకు ఆటల్లో మంచి భవిష్యత్తు ఉంటది. క్రీడలు వదిలిపెట్టకు' అన్నారు. తప్పిన సబ్జెక్టు చదివి పాసయ్యా.

చదువుతూనే పారాఅథ్లెటిక్స్ పోటీల్లో

లాయర్ అంటే ఇష్టం. చిన్నప్పుడు వివాదాలు జరిగేటప్పుడు పెద్దమనిషిగా మాట్లాడి, తీర్పు ఇవ్వాలనిపించేది. అందుకే ఇంటర్ తర్వాత బిఎల్ చదివా. బెంగుళూరు యూనివర్శిటీలో లా కాలేజ్‌లో సీటు సంపాదించి ఐదేళ్లు ఎల్ఎల్‌బి చదివా. దానికీ కష్టపడ్డా. చదువుకుంటూనే నిమిషం వృథా చేయకుండా ఆటలు ఆడేందుకు వెళ్లేవాడిని. అవే నన్ను మానసికంగా కుంగిపోకుండా నిలబెట్టాయి. స్విమ్మింగ్, అథ్లెటిక్స్ క్రీడల్లో శిక్షణ తీసుకున్నా. పోటీల్లో పాల్గొని కాలేజీ స్థాయిలో జాతీయ స్థాయిలో పాల్గొని ఆరు జాతీయ, సిల్వర్ పతకాలు వచ్చాయి. ఆసియా పారా గేమ్స్ అనే ఫెస్పిక్



గేమ్‌లకు ఎంపికయ్యా. థాయిలాండ్‌లో జరిగిన పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించా. ముఖ్యమంత్రి జయలలిత చేతుల మీదగా ప్రశంసా పత్రాలూ అందుకున్నా.

రైల్వేలో ఉద్యోగం చేస్తూ ...

క్రీడారంగంలో నా ప్రతిభకు గుర్తింపుగా 22 ఏళ్ల క్రితం రైల్వే కోటాలో విజయవాడ డివిజన్‌లో రైల్వే అడ్మినిస్ట్రేషన్‌గా ఉద్యోగం వచ్చింది. దాంతో విజయవాడలో గాంధీనగర్‌లో కుటుంబంతో స్థిరపడ్డా. ఉద్యోగం చేస్తూ రైల్వేజోన్‌లో నిర్వహించే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నా. ఇప్పటివరకు 22 అంతర్జాతీయ స్థాయిలో, జాతీయ పారాగేమ్స్‌లో పాల్గొని 28 పసిడి, ఏడు రజిత, నాలుగు కాంస్య పతకాలను కైవసం చేసుకున్నా. అప్పట్లో ముఖ్యమంత్రి రాజశేఖర్, చంద్రబాబు చేతుల మీదుగా ప్రశంసలు, అభినందనలు అందుకున్నా. ఆటలంటే ప్రాణం. అందుకే ఒక్క నిమిషం వృథా చేయను.' అంటున్న సుబ్బయ్య తిరుమలై ఉదయాన్నే లేచి గ్రౌండ్‌కు వెళ్లి స్విమింగ్ చేయనిదే నిద్రపోరు. సుమారు ఐదు గంటలు విరామం లేకుండా స్విమ్ చేస్తారు. మానసికంగా, ఆరోగ్యంగా దృఢంగా ఉండటానికి అదే ఆయన జీవిత రహస్యం.

- పద్మావతి

మా చిరునామా
రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక
ప్రజాశక్తి భవనం
అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి - 522501,
గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

రంగవల్లి





ఎం.విజయలక్ష్మి,
ఉక్కునగరం, విశాఖ.
19 చుక్కలు
1 వచ్చేవరకు (సరి చుక్క)

దోబూచులాడుతున్న విజయం

టీమిండియా లక్ష్యం-145, ప్రస్తుతం-45/4 ● మెహిదీ హసన్‌కు మూడు వికెట్లు

ఢాకా: భారత్–బంగ్లాదేశ్ జట్ల మధ్య జరుగుతున్న రెండో, చివరి టెస్ట్ గెలుపు ఇరుజట్లను ఊరిస్తోంది. బంగ్లాదేశ్ నిర్దేశించిన 145పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా మూడోరోజు ఆట నిలిచే సమయానికి 40పరుగు లకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. నాల్గోరోజు టీమిండియా గెలుపుకు మరో 100పరుగులు చేయాల్సి ఉండగా.. బంగ్లాదేశ్ జట్టు మరో 6వికెట్ల ను కూలిస్తే విజయం వరించనుంది. ఓవర్‌నైట్ స్కోర్ 7 పరుగులతో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ జట్టు 231పరుగులకు ఆలౌటైంది. జాకిర్(51), లింటన్ దాస్(73) అర్ధసెంచరీలకు తోడు నూరుల్ హసన్(31), తస్కిన్ అహ్మద్(31)మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ జట్టు 87పరుగులు వెనుకబడ్డ నేపథ్యంలో టీమిండియా ముందు 145పరుగుల లక్ష్యాన్ని మాత్రమే ఉంచగల్గింది. స్వల్ప లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియాకు మెహిదీ హసన్ దెబ్బతీసాడు. టాపార్డర్ బ్యాటర్స్ శుభ్‌మన్, పుజారా, కోహ్లిలను మెహిదీ హసన్ ఔట్ చేయగా.. కేఎల్ రాహుల్‌ను షకీబ్ పెవీలియన్‌కు పంపాడు. మూడో రోజు ఆట నిలిచే సమయానికి అక్షర్ పటేల్(26), ఉనాద్కట్(4) క్రీజ్‌లో ఉన్నారు. ఈ టెస్టులో భారత్ విజయం సాధించాలంటే మరో 100 పరుగులు కావల్సి ఉండగా.. బంగ్లాదేశ్‌కు ఆరు వికెట్లు దక్కితే చాలు.



స్కోర్‌బోర్డు..

టీమిండియా రెండో ఇన్నింగ్స్: శుభ్‌మన్ గిల్ (స్టంప్) నూరుల్ హసన్ (బి)మెహిదీ హసన్ 7, కేఎల్ రాహుల్ (సి)నూరుల్ (బి)షకీబ్ 2, పుజారా (స్టంప్)నూరుల్ (బి)మెహిదీ 6, అక్షర్ పటేల్ (బ్యాటింగ్) 26, విరాట్ కోహ్లి (సి)మోమినుల్ (బి)మెహిదీ హసన్ 1, ఉనాద్కట్ (బ్యాటింగ్) 3, (23ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 45పరుగులు.

వికెట్ల పతనం: 1/3, 2/12, 3/29, 4/37

బౌలింగ్: షకీబ్ 6-0-21-1, తైజుల్ 8-4-8-0, మెహిదీ హసన్ 8-3-12-3, తస్కిన్ అహ్మద్ 1-0-4-0



హర్మన్‌ప్రీత్‌కు పగ్గాలు

హాకీ ప్రపంచకప్‌కు జట్టు ఇదే!

బెంగళూరు: జనవరి 13 నుంచి 29వరకు జరిగే పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్న మెంట్‌లో పాల్గొనే భారత జట్టును హాకీ ఇండియా(హెచ్ఐ) శనివారం ప్రకటించింది. 18 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు స్టార్ డిఫెండర్ హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా... అమిత్ రోహిదాస్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరి స్తారు. ఈ మెగా టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటున్నాయి. పూల్ 'డి'లో ఇంగ్లండ్, వేల్స్, స్పెయిన్‌లతో కలిసి భారత జట్టు ఉంది.

జట్టు: శ్రీజేశ్, కషన్ పాఠక్ (గోల్‌కీపర్లు), హర్మన్‌ప్రీత్, అమిత్, జర్మన్‌ప్రీత్, సురేందర్, వరుణ్, నీలం సంజీప్, మన్‌ప్రీత్, హార్దిక్, నీలకంఠ, షంషేర్, వివేక్ సాగర్, ఆకాశ్‌దీప్, మన్‌దీప్, లలిత్, అభిషేక్, సుఖ్‌జీత్.

కోహ్లి సీరియస్..



కోహ్లీకి ఔటైన సందర్భంగా బంగ్లాదేశ్ ఫీల్డర్లు రెచ్చగొట్టే ధోరణిలో సంబరాలు చేసుకోవడం ప్రస్తుతం నెట్టింట్లో వైరల్‌గా మారింది. ఫీల్డింగ్‌లో మూడు క్యాచ్‌లు జారవిడిచిన కోహ్లి.. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగి 22 బంతులు ఎదుర్కొని ఒక్క పరుగు మాత్రమే చేసి మెహిదీ హసన్ బౌలింగులో ఔటయ్యాడు. మెహిదీ వేసిన బంతిని డిఫెన్స్ ఆడగా ఆ బంతి షార్ట్ లెగ్‌లో మోమినుల్ క్యాచ్ అందుకున్నాడు. దీంతో బంగ్లాదేశ్ యువ ఆటగాళ్ల ఆనందానికి హద్దే లేకుండాపోయింది. ఎగిరి గంతులేస్తూ కోహ్లిని రెచ్చగొట్టారు. దీంతో మైదానానికి వీడుతున్న కోహ్లీ కోపంగా వారి వద్దకు వెళ్లే ప్రయత్నం చేయగా.. అది గమనించిన అంపైర్లు వెంటనే అప్రమత్తమయ్యారు. బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబల్ కూడా వెంటనే ఆటగాళ్ల వద్దకు వచ్చి పరిస్థితిని అదుపు చేశాడు. అంపైర్లు సర్ది చెప్పడంతో కోహ్లీ మైదానాన్ని వీడాడు.

'మెరీ క్రిస్‌మస్' టైటిల్ పోస్టర్

ఒకవైపు స్టార్ హీరోగా కొనసాగుతూనే మరో వైపు క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విలన్‌గా నటిస్తూ విలక్షన నటుడిగా ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపును సంపాదించికున్నాడు విజయ్ సేతుపతి. శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మెరీ క్రిస్‌మస్'. ఐదేళ్ల గ్యాప్ తర్వాత రాఘవన్ తీస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. తాజాగా మేకర్స్ ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. రెడ్ వైన్‌తో ఉన్న రెండు గ్లాసులు పగిలినట్లు పోస్టర్ లో చూపించారు. చిత్రాన్ని వచ్చే ఏడాది రిలీజ్ చేస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. క్రైమ్ కామెడీ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కత్రినా కైఫ్ నటిస్తుంది. ఈ సినిమాను టిప్స్ ఫిలింస్, మ్యాచ్ బాక్స్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కాగా ఈ సినిమా హిందీతో పాటు తమిళంలోనూ రిలీజ్ కానుంది. ఇక విజయ్ నేరుగా నటిస్తున్న తొలి హిందీ చిత్రం ఇదే కావడం విశేషం.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma, on behalf of Prajasakti Printers & Publishers Private Limited,BackSide Radio Station, Ulchala Road, Kurnool-518003,A.P State, Ph : 08518-259971, and printed at Prajasakti Printers & Publishers Private Limited, Back side Radio station, Ulchala Road, Kurnool-518003, Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, e-mail:editorprajasakthi@gmail.com, RNI Regd.No.APTEL/2004/12202